


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 95, పేజీలు - 08
మంగళవారం, సెప్టెంబర్ 9, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD






## హైదరాబాద్‌కు
# గోదావరి జలాలు

### - నల్గొండ ప్రజల కోసమే మూసీ ప్రక్షాళన

- గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 2, 3 ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన
- నగర ప్రజల దాహార్తి తీర్చడానికే ఈ పథకం తీసుకువచ్చామన్న ముఖ్యమంత్రి
- సమస్యలు సృష్టించినా సమన్వయంతో ముందుకు వెళతామని వ్యాఖ్య

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాబోయే పదేళ్లలో హైదరాబాద్ ను అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దడమే కాకుండా లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మహానగరాన్ని అభివృద్ధి చేయడంలో ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు నిర్వాసితులు అందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. గోదావరి తాగునీటి సరఫరా పథకం (ఫేజ్ %×× ు ×××%), ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను నింపడం ద్వారా మూసీ నది పునరుజ్జీవం పథకానికి గండిపేట వద్ద సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. దాదాపు రూ. 7,360 కోట్ల వ్యయంతో రెండేళ్లలో పూర్తి చేయాలన్న లక్ష్యంతో చేపట్టే ఈ ప్రాజెక్టు కోసం గోదావరి నది నుంచి 20 టీఎంసీ నీటిని తరలించడం ప్రధానం కాగా, అందులో జంట నగరాల తాగునీటి అవసరాల కోసం 17.50 టీఎంసీల నీటిని ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ చెరువులను నింపడం, మరో 2.50 టీఎంసీల జలాలను మూసీ నది పునరుజ్జీవనానికి కేటాయించడానికి ఉద్దేశించిన ప్రాజెక్టు ఫోటో ఎగ్జిబిషన్ ను తిలకించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ "గోదావరి జలాలను తరలించే ఈ గొప్ప కార్యక్రమం ద్వారా జంట నగరాల తాగు నీటి సమస్యను పరిష్కరించడమే కాకుండా మూసీ కాలుష్యాన్ని నివారించి నల్గొండ జిల్లా ప్రజలకు విముక్తి కల్పిస్తాం. నగరానికి ప్రతి ఏటా 3 శాతం ప్రజలు వలసలు పెరుగుతున్నాయి. నగరం కోటిన్నర జనాభాకు పెరుగుతున్న తరుణంలో అందుకు తగ్గట్టుగా భవిష్యత్తు ప్రణాళికలు అవసరం.

2లో..




## వాణిజ్య లోటుపై
# అసంతృప్తి

### - బ్రిక్స్ వేదికగా జైశంకర్ కీలక వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రస్తుతం ప్రపంచం అనేక సంక్షోభాలతో సతమతమవుతోందని, ఈ సవాళ్లను పరిష్కరించడంలో అంతర్జాతీయ వ్యవస్థలు విఫలమవుతున్నాయని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. బ్రిక్స్ దేశాల నాయకుల వర్చువల్ సదస్సులో ఆయన ప్రసంగిస్తూ, ప్రపంచ వాణిజ్యంలో న్యాయమైన, పారదర్శక విధానాలను అనుసరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. అంతేకాకుండా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్సీ) వంటి బహుళపాక్షిక వేదికల్లో సంస్కరణలు తక్షణావసరమని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రపంచ వాణిజ్య సరళి, మార్కెట్ అవకాశాలు ప్రధాన సమస్యలుగా మారాయని జైశంకర్ అభిప్రాయపడ్డారు. వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి నిర్మాణాత్మక, సహకార వైఖరి అవసరమని, అనవసరమైన అడ్డంకులను సృష్టించడం

2లో..

## ఉపరాష్ట్రపతి ఎన్నికలకు
# బీఆర్ఎస్ దూరం

### - ఇటు వేధింపులు, అటు అవసరం లేదని నిర్ణయం




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఉప రాష్ట్రపతి ఎన్నికలకు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వ వేధింపులు కారణమని ఆరోపించింది. ఉప రాష్ట్రపతి ఎన్నికలను బీఆర్ఎస్ పార్టీ బహిష్కరించింది. తాము ఎన్నికల్లో ఎవరికీ మద్దతు తెలపడం లేదని, ఈ ఎన్నికలకు దూరంగా ఉండన్నట్లు బీఆర్ఎస్ అధికారికంగా ప్రకటించింది. బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్, రాజ్యసభ సభ్యుడు కె. సురేష్ రెడ్డి ఈ నిర్ణయాన్ని మీడియాకు తెలిపారు.

2లో..

## జాతీయ విద్యావిధానానికి
# పూర్తి మద్దతు

### - కేంద్రం మూడు భాషల విధానంపై నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు




అమరావతి / కోయంబత్తూరు (ప్రశ్న న్యూస్) కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానానికి (ఎన్ఈపీ) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని


2లో..

# అమరావతి క్వాంటం వ్యాలీ అభివృద్ధికి కమిటీలు

### - ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం వ్యాలీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి మార్గదర్శకత్వం, సాంకేతిక పర్యవేక్షణ అందించేందుకు రెండు ప్రత్యేక కమిటీలను నియమించింది. ఇవి అపెక్స్ కమిటీ మరియు ఎక్స్‌పర్ట్ కమిటీగా ఉంటాయి. అపెక్స్ కమిటీలో మొత్తం 14 మంది ప్రముఖ నిపుణులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీకి ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి కామకోటి అధ్యక్షత వహించనున్నారు. 13 మంది నిపుణులతో కూడిన ఎక్స్‌పర్ట్ కమిటీకి తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె సత్యనారాయణ అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ రెండు కమిటీలు

2లో..



## కాళేశ్వరంపై కాంగ్రెస్‌ను
# నిలదీసిన కేటీఆర్

- అసెంబ్లీ సాక్షిగా అక్బరుద్దీన్ ఒవైసీ మీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు
- కాళేశ్వరంపై రేవంత్ ప్రభుత్వానిది రెండు నాల్కల ధోరణి అన్న కేటీఆర్
- "కూలేశ్వరం" నీళ్లతోనే హైదరాబాద్ దాహం తీరుస్తారా? అని ఎద్దేవా

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా మజ్లిస్ నేత అక్బరుద్దీన్ ఒవైసీ అడిగిన ప్రశ్నలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరాకు కూడా నీరు అందలేదని కాంగ్రెస్ నేతలు పదేపదే ఆరోపిస్తుండగా, ప్రభుత్వం విడుదల చేసిన పుస్తకంలోనే 20 లక్షల ఎకరాలకు నీరు

2లో..




# నేపాల్‌లో రణరంగం

### - సోషల్ మీడియాపై నిషేధంతో హింస, 9 మంది మృతి



ఖాట్మండు (ప్రశ్న న్యూస్) సోషల్ మీడియా వేదికలపై ప్రభుత్వం విధించిన నిషేధం నేపాల్‌ను రణరంగంగా మార్చింది. ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ యువత చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. రాజధాని ఖాట్మండులో సోమవారం జరిగిన నిరసనల సందర్భంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో 42 మందికి పైగా

2లో..

## సాధించే వరకు..
# తగ్గేదేలే

- బీసీ హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన కవిత
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను విస్మరించారని ఆరోపణ
- 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఉద్యమ కార్యాచరణ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయ వాతావరణం కల్వకుంట్ల కవిత చుట్టే తిరుగుతోంది. బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాల మధ్య

2లో..

## రాహుల్ గాంధీ ప్రధాని చేసేందుకు
# ఐక్యంగా కృషి చేద్దాం

- రాహుల్ గాంధీ ప్రధాని కావడం దేశానికి చాలా అవసరమని వ్యాఖ్య
- పని చేసిన ప్రతి కార్యకర్తకు పార్టీ లేదా ప్రభుత్వంలో ఏదో పదవి ఇస్తామని హామీ
- మహేశ్ కుమార్ గౌడ్ చేపట్టే ప్రతి పనికి సీఎం, మంత్రివర్గం అండగా ఉంటుందని వెల్లడి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం దేశానికి ఎంతో అవసరమని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు శ్రమించిన ప్రతి కార్యకర్తకు పార్టీ లేదా ప్రభుత్వ పదవిలో ఏదో ఒక అవకాశం తప్పకుండా లభిస్తుందని ఆయన

2లో..



# గెలుపెవరిది.?

- జగదీప్ ధన?డ్ రాజీనామాతో ఉప-రాష్ట్రపతి ఎన్నికలు
- ఓటింగ్ దూరంగా ఉంటామని ప్రకటించిన బీఆర్ఎస్
- సంఖ్యాపరంగా చూసుకుంటే ఎన్డీయేకు మెజార్టీ

2లో..



# హైదరాబాద్‌లో భారీగా రద్దయిన రూ.500, రూ. 1000 నోట్ల పట్టివేత

- నారాయణగూడలో పట్టుకున్న ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు
- కెనరా బ్యాంకు వద్ద ఇద్దరు, వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద ఇద్దరి అరెస్టు
- మూడు బ్యాగుల్లో రూ. 2 కోట్ల విలువ చేసే రద్దయిన నోట్లు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారీగా రద్దయిన రూ.500, రూ.1000 నోట్ల కట్టలు పట్టుబడటం తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నగరంలో కలకలం రేపుతోంది. దాదాపు తొమ్మిదేళ్ల క్రితం రద్దయిన ఈ నోట్ల కట్టలను ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.2 కోట్ల విలువైన ఈ నోట్లు పట్టుబడటం స్థానిక ప్రజల్లో ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. నారాయణగూడ శాంతి థియేటర్ ఎదురుగా ఉన్న కెనరా బ్యాంక్ వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో వాటర్ వర్క్స్ కార్యాలయం

2లో..



# నా కొడుకు రాజకీయాల్లోకి వస్తాడు

### - వైఎస్ షర్మిల సంచలన ప్రకటన

- షర్మిలతో కలిసి కర్నూలు ఉల్లి మార్కెట్ పర్యటనలో రాజారెడ్డి
- వైఎస్ఆర్ వర్ధంతి తర్వాత ఊపందుకున్న పొలిటికల్ ఎంట్రీ ఊహాగానాలు
- షర్మిల అధికారిక ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో మొదలైన చర్చ

అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీలో సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న వైఎస్ కుటుంబం నుంచి రాజకీయ వారసుడిగా ప్రస్తుతం మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఉన్నారు. అయితే జగన్ కూ, ఆయన సోదరి వైఎస్ షర్మిలకూ మధ్య రాజకీయంగా అస్సలు పొసగడం

2లో..



# హైదరాబాద్‌కు గోదావరి జలాలు

పెరుగుతున్న నగర అవసరాల మేరకు కృష్ణా జలాలు కూడా సరిపోవని అనుకున్నప్పుడు గోదావరి జలాలను తరలించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత పదేళ్లలో కృష్ణా, గోదావరి నదుల నుంచి చుక్క నీరు కూడా హైదరాబాద్ నగరానికి తరలించలేదు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ గోదావరి నీటిని తరలించి కేవలం హైదరాబాద్ ప్రజలకు తాగునీరే కాకుండా కాలుష్యం నుంచి మూసీ నదిని ప్రక్షాళన చేసే కార్యక్రమం చేపట్టాం" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మురికికూపంగా మారి విషం చిమ్ముతున్న మూసీ జలాల వల్ల ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, భువనగిరి, ఆలేరు ప్రాంతాల్లో నీరు తాగితే పశువులే కాదు, మనుషులు ప్రాణాలు పోతున్నాయి. పుట్టబోయే బిడ్డలు సైతం అంగవైకల్యంతో పుడుతున్నారు. గుజరాత్ రాష్ట్రంలో సబర్మతీ, ఉత్తర ప్రదేశ్‌లో గంగా, ఢిల్లీలో యమునా నదుల ప్రక్షాళన చేసుకున్నప్పుడు 4 కోట్ల తెలంగాణ ప్రజలకు సంబంధించిన మూసీ నది ప్రక్షాళన ఎందుకు జరగొద్దు. ఆ జిల్లా ప్రజలతో కలిసి నడిచినప్పుడు ఎలాగైనా సరే మూసీని పునరుజ్జీవింపజేయాలని ప్రజలు కోరినప్పుడు ఆరోజు మాటిచ్చా. మూసీని ప్రక్షాళన చేస్తాం. హైదరాబాద్ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుతాం. హైదరాబాద్ ఫ్యాక్టరీల కాలుష్యం మూసీలో కలవకుండా నియంత్రిస్తాం అని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరానికి గోదావరి జలాలను తరలించాలన్న ప్రాజెక్టుకు మూలం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నాం. గోదావరిపై 2008 లో తుమ్మడిహెట్టి వద్ద దివంగత వైఎస్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత - చేవెళ్ల సుజల స్రవంతిని ప్రారంభించారు. ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు విషయంలో త్వరలోనే మహారాష్ట్ర ముఖ్యమంత్రి గారితో చర్చలు జరుపుతాం. తుమ్మడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు చేపట్టాలని ప్రతిపాదిస్తే, మహారాష్ట్ర ప్రభుత్వం 142 మీటర్ల ఎత్తు వరకు అభ్యంతరం చెప్పడం లేదు. మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి మధ్యంతరంగా148, 150 మీటర్ల వరకైనా ఒప్పించి ప్రాజెక్టును పూర్తి చేసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లక్షన్నర, రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో సంకల్పించినట్టుగా ప్రాజెక్టును పూర్తి చేసి చేవెళ్ల, వికారాబాద్, తాండూరు, పరిగి వరకు వ్యవసాయానికి గోదావరి జలాలను తరలించడం ద్వారా ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకుంటామని అన్నారు. ఈ ప్రాజెక్టు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నాం బుద్వేల్ ప్రాంతాన్ని ఒక అద్భుతమైన హబ్ గా అభివృద్ధి చేస్తాం. గేవ్ వే ఆఫ్ హైదరాబాద్ ప్రాజెక్టు కోసం ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రభుత్వం తలపెట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో కలిసిరండి అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# వాణిజ్య లోటుపై అసంతృప్తి

వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని హితవు పలికారు. వాణిజ్యేతర అంశాలతో వాణిజ్యాన్ని ముడిపెట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ సందర్భంగా, కొన్ని బ్రిక్స్ భాగస్వామ్య దేశాలతోనే భారత్‌కు అత్యధిక వాణిజ్య లోటు ఉందని, ఈ సమస్యకు సత్వర పరిష్కారాలు కనుగొనాలని తాము ఒత్తిడి చేస్తున్నామని ఆయన గుర్తుచేశారు. కరోనా మహమ్మారి, ఉక్రెయిన్, పశ్చిమాసియాలో జరుగుతున్న ఘర్షణలు, వాతావరణ మార్పుల వంటివి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేశాయని జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులను తట్టుకోవాలంటే మరింత పటిష్ఠమైన, నమ్మకమైన సరఫరా గొలుసులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉత్పత్తి, తయారీ రంగాలను కొన్ని దేశాలకే పరిమితం చేయకుండా, వివిధ భౌగోళిక ప్రాంతాల్లో వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఘర్షణల వల్ల 'గ్లోబల్ సౌత్' దేశాలు ఆహారం, ఇంధనం, ఎరువుల భద్రత విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని జైశంకర్ తెలిపారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సంస్థల పనితీరులో అనేక లోపాలు బయటపడ్డాయని, అందుకే యూఎన్ఎస్‌సీలో సంస్కరణల కోసం భారత్ ఎప్పటినుంచో డిమాండ్ చేస్తోందని పునరుద్ఘాటించారు. ఈ సంస్కరణల ఆవశ్యకతపై బ్రిక్స్ దేశాలు సానుకూలంగా ఉన్నాయని, ప్రపంచం ఎదురుచూస్తున్న ఈ మార్పు కోసం అందరం కలిసి ఒక బలమైన గొంతుకగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఉపరాష్ట్రపతి ఎన్నికలకు బీఆర్ఎస్ దూరం

### తెలంగాణ ప్రభుత్వ వేధింపులతో బీఆర్ఎస్ కీలక నిర్ణయం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమపై వేధింపులకు పాల్పడుతుందని, రాజకీయంగా తమను ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఎన్నికల్లో పాల్గొనడం సరైనది కాదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ నాయకత్వం నిర్ణయించినట్లు తెలిపారు. సామాజిక న్యాయం, రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ ప్రభుత్వ చర్యలు అడ్డంకిగా మారుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరంగా సరైన వాతావరణం లేకపోవడంతో ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు సురేష్ రెడ్డి వెల్లడించారు. ఈ నిర్ణయాన్ని పార్టీ శ్రేణులు సమర్థించాయని తెలిపారు. బీఆర్ఎస్ నిర్ణయంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణంపై చర్చలు జరుగుతున్నాయి.

### ఎన్డీయేకు మద్దతు అవసరం లేదు

అలాగే, ఎన్డీఏకు బీఆర్ఎస్ మద్దతు అవసరం లేదని పార్టీ భావిస్తోంది. ఆ కారణంగా ఉపరాష్ట్రపతి ఎన్నికల నుంచి దూరంగా ఉండాలని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకున్నట్లు సురేష్ రెడ్డి తెలిపారు. కవిత లిక్కర్ స్కామ్ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కొన్ని రోజులు కేంద్రంపై విమర్శలు గుప్పించారు. తమను రాజకీయంగా ఎదుర్కోలేకనే లిక్కర్ కేసులో కవితను ఇరికించారని అరెస్ట్ చేసిన సమయంలో కేటీఆర్, హరీష్ రావు అన్నారు.

# జాతీయ విద్యావిధానానికి పూర్తి మద్దతు

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. కోయంబత్తూరులో 'ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్ 2025' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఎన్ఈపీలోని మూడు భాషల విధానాన్ని గట్టిగా సమర్థించారు. ఈ విధానం హిందీని తప్పనిసరిగా రుద్దే ప్రయత్నం కాదని, విద్యార్థులు మూడు భాషలు నేర్చుకునేందుకు ప్రోత్సహించే మంచి అవకాశమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా లోకేశ్ తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. "నేను కూడా మూడు భాషలు నేర్చుకున్న విద్యార్థినే. ఇప్పుడు నా కొడుకు కూడా అదే చేస్తున్నాడు. ఈ రోజుల్లో పిల్లలు ఐదు భాషల వరకు నేర్చుకుంటున్నారు.

వారికి నచ్చిన జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషలు నేర్చుకుంటే ఆయా దేశాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి" అని ఆయన వివరించారు. పిల్లలకు ఇష్టమైన భాషను నేర్చుకునే స్వేచ్ఛ ఇవ్వాలని, దానిపై రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశమైన విషయాన్ని లోకేశ్ గుర్తుచేశారు. ఆ సమావేశంలో మాతృభాషకు ఇవ్వాల్సిన ప్రాధాన్యంపై చర్చ జరిగిందని తెలిపారు. "ఒక భారతీయుడిగా నాకు మాతృభాష విలువ తెలుసు, అదే సమయంలో హిందీ నేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలూ తెలుసు" అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థుల ఆసక్తి మేరకు ఒడియా, తమిళం, కన్నడ మాధ్యమాల్లో బోధన చేపట్టేందుకు ఆదేశాలు ఇస్తున్నాం అని వెల్లడించారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్‌ను నిలదీసిన కేటీఆర్

అందించినట్లు పేర్కొన్నారని అక్బరుద్దీన్ సభలో నిలదీసిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. కాళేశ్వరం బ్యారేజీ కొట్టుకుపోయిందని చేస్తున్న ప్రచారాన్ని కూడా కేటీఆర్ ఖండించారు. 12 లక్షల క్యూసెక్కుల భారీ వరద వచ్చినా బ్యారేజీ చెక్కుచెదరలేదని, అయినా 20 నెలలుగా దానికి మరమ్మతులు ఎందుకు చేయడం లేదని అక్బరుద్దీన్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురద చల్లడమే లక్ష్యంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. "ఇన్ని రోజులు కాళేశ్వరాన్ని 'కూలేశ్వరం' అంటూ విమర్శించిన నోళ్లే, ఇప్పుడు అదే ప్రాజెక్టు నీటితో హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీరుస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉంది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ చర్యతో కాళేశ్వరం తెలంగాణకు కల్పతరువు, కామధేనువు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరోక్షంగా అంగీకరించినట్లేనని ఆయన అన్నారు

. గంధమల్ల రిజర్వాయర్ విషయంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద పెద్ద మాటలు మాట్లాడారని కేటీఆర్ అన్నారు. దాన్ని పూర్తి చేస్తానని శంకుస్థాపన రోజే చెప్పారని, కానీ ఆ గంధమల్ల రిజర్వాయర్‌కు కూడా కాళేశ్వరం అనుసంధాన ప్రాజెక్టయిన కొండ పోచమ్మ సాగర్ నుంచే నీళ్లు వస్తాయన్న నిజాన్ని విస్మరించరాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మూసీ నది పునరుజ్జీవనం కార్యక్రమానికి శంకుస్థాపన మల్లన్న సాగర్ లేదా కొండపోచమ్మ సాగర్ వద్ద చేయాలని అన్నారు. కానీ రేవంత్ రెడ్డి గుండెకాయను వదిలిపెట్టి గండిపేట వద్ద చేస్తున్నారని విమర్శించారు. గండిపేటకు తెస్తున్నది కాళేశ్వరం జలాలు కాదా? అని నిలదీశారు. మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్‌కు నీటిని తీసుకువస్తున్నారని అన్నారు.

## భువనగిరిలో ముస్లింల మిలాద్-ఉన్-నబి వేడుకలు

ఆలేరు, : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో ముస్లింలు సోమవారం మిలాద్-ఉన్-నబి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రముఖ మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. ఇస్లాం మత స్థాపకుడైన మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలు ఏటా జరుగుతాయి. ఈ సందర్భంగా మహ్మద్ ప్రవక్త త్యాగాలు, సేవలను ఇమామ్‌లు వివరించి, ఆయన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ముస్లింలు ఆయన బోధనలను ఆచరించారు.

# అమరావతి క్వాంటం వ్యాలీ అభివృద్ధికి కమిటీలు

ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పని చేయనున్నాయి. అమరావతిలో ఏర్పాటు చేయబోయే క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ద్వారా చేపట్టే కార్యక్రమాలకు ఈ కమిటీలు సమగ్ర మార్గదర్శనం అందించనున్నాయి. అలాగే, సాంకేతిక పరిజ్ఞానం, అమలులో గల సవాళ్లపై పర్యవేక్షణ చేపట్టనున్నారు. ఈ కమిటీల ఏర్పాటు మరియు బాధ్యతల వివరణకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాటమనేని భాస్కర్ జారీ చేశారు.

### అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు చర్యలు

గ్లోబల్ క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా అమరావతిని మార్చేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. 2026 జనవరి నాటికి అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం జూన్ నెలాఖరులో క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం టెక్నాలజీలపై నేషనల్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ లో నీతి ఆయోగ్ సహా వివిధ ఐఐటీల నుంచి ప్రొఫెసర్లు, నిపుణులు, గ్లోబల్ లీడర్లు, ఐబీఎం, టీసీఎస్, అమెరికన్ కాన్సులేట్ ప్రతినిధులు ప్లీనరీ సెషన్లకు హాజరయ్యారు. సీఎం చంద్రబాబు క్వాంటం వ్యాలీ ఏర్పాటులో రాష్ట్ర ప్రాధాన్యతలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు అమరావతిలో ప్రఖ్యాత ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు క్వాంటం వ్యాలీ టెక్ పార్కును ఏర్పాటు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఐబీఎం సంస్థ దేశంలోనే అతిపెద్ద క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనుంది. రెండు 156 క్యూబిట్ క్వాంటం సిస్టంలను ఐబీఎం ఇన్ స్టాల్ చేయనుంది. దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలను ఎల్ అండ్ టీ సంస్థ ఏర్పాటు చేస్తుంది. మరో టెక్ సంస్థ టీసీఎస్ క్వాంటం కంప్యూటింగ్ సేవలతో పాటు హైబ్రీడ్ కంప్యూటింగ్ సొల్యూషన్స్ సహకారం అందించనుంది.

### అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతిలో క్వాంటం వ్యాలీ అభివృద్ధి

అమరావతిలో ఏర్పాటు చేయబోయే క్వాంటం వ్యాలీని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రెడీ చేసింది. దశలవారీగా మొత్తం 90 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా ఈ క్వాంటం వ్యాలీ అభివృద్ధి కావాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా, హైదరాబాదులోని హైటెక్ సిటీ తరహాలో ప్రభుత్వ- ప్రైవేట్ భాగస్వామ్యంతో ఆధునిక బిల్డింగులు నిర్మించనున్నారు. ఈ భవనాలను వివిధ టెక్ సంస్థలకు వాడుకునేందుకు ఇవ్వనున్నారని అధికారులు తెలిపారు. భవనాల డిజైన్లకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే క్లారిటీ ఇచ్చింది. ఉద్యోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఒక్క ఉద్యోగికి సగటున 150 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండేలా డిజైన్ చేయనున్నారు. ఇది అంతర్జాతీయ స్థాయిలో ప్రాచలితమైన ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుంది. ఈ ప్లాన్ ప్రకారం, ప్రభుత్వం అభివృద్ధి చేయబోయే స్థలంలో దాదాపు 60,000 మందికి పని చేసే అవకాశాలు కల్పించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని అధికారులు చర్యలు చేపట్టారు.

# నేపాల్‌లో రణరంగం

గాయపడటంతో దేశవ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ సహా 26 సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను నిషేధిస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా 'హమి నేపాల్' అనే సంస్థ ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు, యువకులు సోమవారం ఉదయం ఖాట్మండులోని మైతిఘర్ వద్ద సమావేశమయ్యారు. "సోషల్ మీడియాను కాదు, అవినీతిని మూసేయండి," "మా భావప్రకటనా స్వేచ్ఛను హరించవద్దు" అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జాతీయ జెండాలు చేతబూని, జాతీయ గీతం ఆలపిస్తూ పార్లమెంట్ భవనం వైపు భారీ ర్యాలీగా కదిలారు. ఆందోళనకారులు పార్లమెంట్ భవనాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బారికేడ్లను దాటుకుని లోపలికి చొచ్చుకెళ్లేందుకు యత్నించిన నిరసనకారులను అదుపు చేసేందుకు పోలీసులు మొదట టియర్ గ్యాస్, వాటర్ కాననన్లను ప్రయోగించారు. అయినప్పటికీ ఆందోళనకారులు వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనతో న్యూ బానేశ్వర్ ప్రాంతం దద్దరిల్లింది. కాల్పుల్లో గాయపడిన వారిని సమీపంలోని సివిల్, ఎవరెస్ట్ ఆసుపత్రులకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 9 మంది మరణించినట్లు సివిల్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహన్ చంద్ర రేగ్మి ధ్రువీకరించారు. సోషల్ మీడియా నిషేధం తమ ఆగ్రహానికి తక్షణ కారణమే అయినప్పటికీ, దేశంలో ఏళ్లుగా పేరుకుపోయిన వ్యవస్థాగత అవినీతే తమ ప్రధాన ఆందోళనకు కారణమని నిరసనకారులు స్పష్టం చేశారు. "ఈ నిషేధం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. గత తరాలు అన్నీ సహించాయి, కానీ మా తరంతో ఇది ఆగాలి" అని ఇక్షమా తుమ్రోక్ అనే విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లర్ల నేపథ్యంలో ఖాట్మండు జిల్లా యంత్రాంగం నగరంలోని పలు కీలక ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించింది. రాష్ట్రపతి, ప్రధాని నివాసాలు, సింఘ దర్బార్ పరిసరాల్లో మధ్యాహ్నం 12:30 నుంచి రాత్రి 10 గంటల వరకు కర్ఫ్యూ అమలులో ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఖాట్మండులో మొదలైన ఈ నిరసనలు క్రమంగా దేశంలోని ఇతర ప్రధాన నగరాలకు కూడా వ్యాపిస్తున్నాయి.

## రాహుల్ గాంధీ ప్రధాని చేసేందుకు ఐక్యంగా కృషి చేద్దాం

హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీని తిరుగులేని శక్తిగా నిలిపేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేపట్టిన ప్రతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రివర్గం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆయన స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ విషయంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి న్యాయం చేకూరుస్తామని ఆయన అన్నారు. 42 శాతం రిజర్వేషన్ బిల్లును బీజేపీ రాష్ట్రపతి వద్ద నిలిపివేసిందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర దాగి ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

# సాధించే వరకు.. తగ్గేదేలే

ఆమెను సస్పెండ్ చేయడం వెంటనే ఎమ్మెల్సీ పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు రేపింది. ముఖ్యంగా మాజీ మంత్రి హరీశ్ రావుపై చేసిన సంచలనాత్మక ఆరోపణలు ఈ పరిణామాలకు దారితీశాయి. జైలు నుంచి తిరిగి వచ్చినప్పటి నుంచి కవిత బీఆర్ఎస్ పార్టీలోని కొంతమంది నాయకులపై విమర్శనాత్మక రాగాలు పాడుతూ నూతన రాజకీయ వ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు.

తాజాగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో 70కి పైగా బీసీ సంఘాల ప్రతినిధులతో సమావేశమై కవిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఆమె మాట్లాడుతూ బీసీ వర్గాలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ముఖ్యంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని స్పష్టం చేశారు. ఇక రిజర్వేషన్ల అంశం ఇప్పుడు రాజకీయంగా మరింత కీలకమైంది. తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 30లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని గడువు పెట్టినా ప్రభుత్వం సన్నద్ధం కాలేదు. రిజర్వేషన్ల వ్యవహారం సరిగా తేలకపోవడంతో మళ్లీ గడువు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ వేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో లోకల్ బాడీ ఎలక్షన్స్ ఇప్పట్లో జరగబోవనే అనుమానాలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ పరిస్థితిని కవిత ఎత్తి చూపుతూ బీసీల హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నారు. ఆమె తెలంగాణ కాంగ్రెస్ పై మాత్రమే విమర్శలు కాకుండా జాతీయ నాయకత్వాన్ని కూడా ప్రశ్నించింది.

రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇప్పటివరకు పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ఎందుకు లేవనెత్తలేదని ఆమె ప్రశ్నించారు. ఇది కేవలం రాష్ట్రపరమైన అంశం కాదు, జాతీయస్థాయిలో బీసీల న్యాయం కోసం పెద్ద పంథాలో ఉద్యమించాల్సిన అవసరముందని సూచించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై స్పష్టమైన అజెండాతో ముందుకు వెళ్తూ కవిత తనను మళ్లీ రాష్ట్ర రాజకీయాల్లో కీలక ఆటగాడిగా నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఈ రిజర్వేషన్ల అంశం పెద్ద చర్చనీయాంశం కానుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే ఏ ఎన్నికలు జరగరని కవిత స్పష్టంగా హెచ్చరించడం బీసీ సంఘాలను తన వైపు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్న సంకేతాలుగా కనిపిస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు వెనక్కి తగ్గేదేలే అంటూ కల్వకుంట్ల కవిత సష్టం చేశారు.

## సమాజాన్ని మంచి మార్గంలో

# నడిపించడానికి ఇస్కాన్..

నిజామాబాద్ అర్బన్, : భద్ర పౌర్ణమి సందర్భంగా ఇస్కాన్ కంఠేశ్వర్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, సమాజాన్ని మంచి మార్గంలో నడిపించడానికి ఇస్కాన్ వంటి ఆధ్యాత్మిక సంస్థల సేవలు అవసరమని, ప్రజలలో ఈర్ష ద్వేషాలు తొలగిపోయి అందరూ ప్రశాంతంగా జీవించాలంటే అది కేవలం ఆధ్యాత్మిక మార్గం ద్వారానే సాధ్యమని అన్నారు. భజన కీర్తనల ద్వారా మనసు ప్రశాంతంగా ఉంటుందని, అందుకే మన పెద్దలు కుటుంబ సమేతంగా దేవాలయాలకు వెళ్లాలని చెప్పేవారని ఆయన గుర్తు చేశారు.

# గెలుపెవరిది.?

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఉప-రాష్ట్రపతి ఎన్నికలకు సర్వసిద్ధమైంది. నేడు పోలింగ్ జరగనుండగా ఎన్డీఏ అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి తరఫున సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డిలు పోటీ చేస్తున్నారు. నేడు ఉదయం 10 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలు వెల్లడిస్తారు. రాజ్యసభ సెక్రెటరీ జనరల్ పీసీ మోదీ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు సహాయకులుగా మరో ఇద్దరు అసిస్టెంట్ రిట్నరింగ్ ఆఫీసర్లను నియమించారు. ఇక, సీక్రెట్ బ్యాలెట్ విధానంలోనే ఓటింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో పార్టీలు జారీచేసే విప్ చెల్లుబాటు కాదు. అంటే, లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు తమ ఆత్మప్రబోధానుసారం ఓటువేయనున్నారు. ఇక, అధికార ఎన్డీయే గెలుపుపై ధీమాతో ఉంది. కానీ, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బీజేపీ ముందు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇందుకోసం ఆదివారం నాడు బీజేపీ వర్క్‌షాపు నిర్వహించింది. ఇక, ప్రతిపక్ష ఇండియా కూటమి కూడా సోమవారం మధ్యాహ్నం మాక్ పోలింగ్ నిర్వహించి, ఓటింగ్‌పై అవగాహన కలిగించింది. సోమవారం 2.30 గంటలకు పాత పార్లమెంట్ భవనం సెంట్రల్ హాల్‌లో జరిగిన ఈ మాక్ పోలింగ్‌లో విపక్ష పార్టీలు ఎంపీలు పాల్గొన్నారు. లోక్‌సభ, రాజ్యసభలో ఖాళీలను మినహాయిస్తే ప్రస్తుతం మొత్తం 781 మంది సభ్యులు (542 మంది లోక్‌సభ, 239 మంది రాజ్యసభ) ఉన్నారు. ఇందులో 392 ఓట్లు వచ్చిన అభ్యర్థి విజేతగా నిలుస్తారు లేదా చెల్లుబాటైన ఓట్లలో సగాని కంటే ఎక్కువ సాధించిన అభ్యర్థిని విజేతగా పరిగణిస్తారు. అయితే, క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశం కూడా లేకపోలేదు. కిందటిసారి జగదీప్ ధన?డ్ పోటీచేసినప్పుడు ఎన్డీయేలో లేని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్, బీజేడీలు మద్దతు తెలిపాయి. దీంతో మూడు దశాబ్దాల తర్వాత భారీ మెజార్టీ (75 శాతం ఓటింగ్)తో ఉప-రాష్ట్రపతిగా గెలిచిన వ్యక్తిగా ధన?డ్ నిలిచారు. ఈసారి మాత్రం ఓటింగ్‌కు బీఆర్ఎస్, బీజేడీలు దూరంగా ఉంటామని ప్రకటించాయి. దీంతో 770 మంది ఓటువేయనున్నారు. ప్రస్తుత బలాబలాలను పరిశీలిస్తే ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపు నల్లేరుపై నడకే. ఎన్డీయేకు మొత్తం 425 మంది సంఖ్య బలం ఉండగా.. వైపీసీ కూడా మద్దతు తెలిపింది. ఏడుగురు స్వతంత్ర ఎంపీలు, అకాలీదళ్, జెడ్‌పీఎంలకు చెందిన ఒక్కొక్క ఎంపీలను కలుపుకుంటే ఎన్డీయే అభ్యర్థికి 458 ఓట్లు వస్తాయి. ఇక, ప్రతిపక్ష ఇండియా కూటమికి మొత్తం 324 మంది సభ్యులు ఉన్నారు. ఈ ఎన్నికలు 2022 కంటే ఆసక్తిగా మారాయి. ఎందుకంటే గతేడాది లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షం మెరుగైన ప్రదర్శన చేయడంతో ఎంపీల సంఖ్య పెరిగింది. కానీ, 100 శాతం ప్రతిపక్ష ఎంపీలు జస్టిస్ బి సుదర్శన్ రెడ్డికి ఓటు వేసినా ఆయనపై ఎన్డీయే అభ్యర్థి 100 నుంచి 135 ఓట్ల తేడాతో గెలిచే అవకాశాలు ఉన్నాయి. అయితే, త్వరలోనే బిహార్, బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తమ బలాన్ని నొక్కిచెప్పడానికే ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాలు తమ అభ్యర్థిని నిలబెట్టాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

## హైదరాబాద్‌లో భారీగా రద్దయిన

# రూ.500, రూ. 1000 నోట్ల పట్టివేత

వద్ద మరో ఇద్దరిని పట్టుకున్నారు. వీరి వద్ద ఉన్న మూడు బ్యాగులను తనిఖీ చేయగా అందులో రద్దయిన రూ.500, రూ.1000 నోట్ల కట్టలు బయటపడ్డాయి. వాటి విలువ సుమారు రూ.2 కోట్లు అని పోలీసులు వెల్లడించారు. పట్టుబడిన నోట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నోట్లు ఎక్కడి నుంచి ఎవరి వద్ద నుండి సేకరించబడ్డాయి.? ఎవరికి అందించబోతున్నారు అన్న దానిపై విచారణ చేపట్టారు. అవసరమైతే ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖలను కూడా సంప్రదించే అవకాశముందని తెలుస్తోంది. పోలీసుల ప్రాథమిక అనుమానం ప్రకారం, ఈ నోట్లను కొత్త నోట్లుగా మార్చిస్తామని చెప్పి అమాయకులను మోసం చేసే అవకాశం ఉంది. ఇంత పెద్ద మొత్తంలో నోట్లను పట్టుకోవడం వెనుక బ్లాక్ మనీ మార్పిడి గుంపుల పాత్ర ఉండవచ్చని భావిస్తున్నారు. కాగితంగా విలువలేని నోట్లను ఇంకా కొన్ని ముఠాలు మోసాలకు వాడుతున్నారనేది స్పష్టమవుతోంది. 2016 నవంబర్ 8న నోట్ల రద్దు ప్రకటించారు. ఆ రోజు నుండి రూ.500, రూ.1000 నోట్లు చెలామణి కోల్పోయాయి. అయినప్పటికీ, దేశంలోని పలు ప్రాంతాల్లో అప్పుడప్పుడు రద్దయిన నోట్లను నిల్వ ఉంచి అక్రమ లావాదేవీలకు ఉపయోగించే ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయన్న సమాచారం ఉంది. హైదరాబాద్‌లో తాజాగా బయటపడిన ఈ ఘటన కూడా అలాంటి యత్నమేనని పోలీసులు అనుమానిస్తున్నారు.

# నా కొడుకు రాజకీయాల్లోకి వస్తాడు

లేదు. ఈ నేపథ్యంలో వైఎస్ కుటుంబం నుంచి రాజకీయ వారసుడిగా తన కుమారుడు రాజారెడ్డిని ఎంట్రీ చేయించేందుకు పీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల తొలి అడుగు వేశారు. ఈ మేరకు కర్నూలుకు తీసుకెళ్లి మరీ రాజారెడ్డిని ప్రజలకు పరిచయం చేశారు. ఇన్నాళ్లూ వైఎస్ షర్మిల కుమారుడిగా, తల్లిచాటు బిడ్డగా ఉన్న వైఎస్ రాజారెడ్డికి ఉన్నత విద్యావంతుడిగా, తన పని తాను చేసుకుపోతాడనే పేరుంది. వైఎస్ కుటుంబం నుంచి వచ్చినా రాజకీయంగా ఎలాంటి హంగామా చేయకుండా సైలెంట్ గా ఉంటూ వస్తున్న రాజారెడ్డిని ఉన్నట్లుండి రాజకీయాల్లోకి తీసుకురావాలని షర్మిల నిర్ణయించినట్లు తెలుస్తోంది.

అందుకే ఇవాళ అకస్మాత్తుగా తన తల్లి విజయమ్మ ఆశీర్వాదం ఇప్పించి మరీ కర్నూలు మార్కెట్ యార్డ్ లో ఉల్లి రైతుల్ని కలిసేందుకు రాజారెడ్డిని షర్మిల తీసుకెళ్లారు. కర్నూలు మార్కెట్ యార్డ్ లో ఉల్లి రైతుల్ని పరామర్శించే సమయంలోనూ తన కుమారుడు రాజారెడ్డిని పక్కనే నిలబెట్టిన షర్మిల ప్రత్యేకంగా ఎలాంటి పరిచయం కూడా చేయలేదు. అయితే చివర్లో రాజారెడ్డిని పొలిటికల్ ఎంట్రీ కోసమే తీసుకుని వచ్చారా అని మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ షర్మిల క్లారిటీ ఇచ్చేశారు. తన కుమారుడు వైఎస్ రాజారెడ్డి ఆంధ్ర రాష్ట్ర రాజకీయాల్లో ఎప్పుడు అవసరం ఉంటే అప్పుడు వస్తాడంటూ షర్మిల తేల్చిచెప్పేశారు. ఇప్పటికే మామ వైఎస్ జగన్ తో అంటీ ముట్టనట్టుగా ఉంటున్న వైఎస్ రాజారెడ్డి షర్మిల కుమారుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేసి కాంగ్రెస్ పార్టీలో కీలకంగా మారతారా లేక సొంత పార్టీ పెట్టి ముందుకువెళ్తారా అన్నది తేలాల్సి ఉంది. జగన్ కు ఇద్దరూ కూతుళ్లే కావడం, షర్మిల కుమారుడు రాజారెడ్డికి కలిసి రానుంది. వైఎస్ కుటుంబ వారసుడిగా రాజారెడ్డిని ముందుకు తెచ్చేందుకు షర్మిలకు అవకాశం దక్కుతోంది. అయితే రాజారెడ్డి రాజకీయాల్లోకి వస్తే వైసీపీ ఎలా స్పందిస్తుందో చూడాలి.

## వేములవాడ రాజన్నాలయానికి రూ. 2.18 కోట్లతో

# 33/11 కేవీ నూతన సబ్ స్టేషన్ మంజూరు

**- ప్రభుత్వ విప్ కు కృతజ్ఞతలు తెలియజేసిన ప్రజలు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి ఆధునిక విద్యుత్ సౌకర్యాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేములవాడ పట్టణంలో రూ. 2.18 కోట్ల వ్యయంతో 33/11 కేవీ సామర్థ్యంతో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ జారీ అయ్యింది. రాష్ట్ర విద్యుత్ సంస్థ సీఎండీ వరుణ్ రెడ్డి ఈ మంజూరు విషయం సోమవారం అధికారికంగా ప్రకటించారు. సబ్ స్టేషన్ ప్రారంభం కావడంతో దేవస్థానంలో లో-ఓల్టేజ్ సమస్యలు తగ్గి, పరిసర ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించగలుగుతారు.
ఈ ప్రాజెక్ట్ సాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వేములవాడ శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిరంతర ప్రయత్నాలతో మంజూరు చేయించడం జరిగింది. ఈ సబ్ స్టేషన్ మంజూరుకు కీలక సహకారం చేసిన ఆది శ్రీనివాస్ కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# జగిత్యాల కలెక్టరేట్ లో వ్యవసాయ విస్తరణ అధికారుల ఏ ఈ ఓ నిరసన



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) కామారెడ్డి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న బస్వ రాజు ఏ ఈ ఓ , డోంగ్లి క్లస్టర్, అధిక పని బారం వలన సెప్టెంబర్ 5 న గుండె పోటు తో మరణించడం జరిగిందని తెలిపారు. బస్వ రాజుతన క్లస్టర్ తో పాటు అదనపు క్లస్టర్ బాధ్యతలు ఉండడం, పంటల నష్ట సర్వే ను వేగవంతంగా చేయమనడం , అలాగే పని ఒత్తిడి పై అతని వివరణ కనీసం వినకుండా షోకాసు నోటీస్ ఇవ్వడం వలన తీవ్ర ఒత్తిడికి,మానసికంగా కృంగి పోవడం వలన గుండె పోటు వచ్చి మరణించడం జరిగిందని తెలిపారు.ఇందుకు నిరసన గా జగిత్యాలతో పాటు అన్ని జిల్లాల లో వ్యవసాయ విస్తరణ అధికారులు నిరసన కార్యక్రమాలు నిర్వహించి జిల్లా వ్యవసాయ అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.జగిత్యాల జిల్లాలో టీ ఏ డి ఏ తిరుపతి నాయక్, టీ ఏ ఓ లు షాహిద్ అలీ, శ్రీనివాస్, ఎం ఏ ఓ లు, ఏ ఈ ఓ లు ఎంప్లాయిస్ తో కలిసి జిల్లా వ్యవసాయ అధికారికి వినతి పత్రం అందజేసి ,తదుపరి కలెక్టరేట్ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారులు – ఏ ఈ ఓ లు సురేందర్ నాయక్, శ్రీనివాస్, భూమేశ్వర్, ఫిరదోస్, శేఖర్, రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్




మేడ్చల్ (ప్రశ్న న్యూస్) పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ సూచించారు. గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని గౌడవెల్లి గ్రామం లో జెడ్ పి హెచ్ ఎస్ ఉన్నత పాఠశాలలో తడి చెత్త, పొడి చెత్త తో పాటు బహిరంగ ప్రదేశాలలో చెత్తను కాల్చవద్దు అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తడి చెత్త పొడి చెత్తను వేరువేరు బాక్స్ లో వెయ్యాలి అంటూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకట గోపాల్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి అంటు రోగాలు రావని ఈ విషయంలో ప్రతి ఒక్కరు పారిశుద్ధ్యం పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తడి పొడి చెత్తను వేరు వేరు చేసే రెండు బాక్సుల్లో తడి పొడి చెత్తను వేయాలని సూచించారు. అసలే వర్షాకాలం అని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాలలో ఎట్టి పరిస్థితుల్లో చెత్త వేయవద్దని, అంతేకాకుండా కాలుష్యం పెరిగినందున బహిరంగ ప్రదేశాలలో చెత్తను కాల్చవద్దని సూచించారు. బహిరంగ ప్రదేశాలలో చెత్తను కాల్చడం నిషేధం అని పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, సత్యం, నరసింహారెడ్డి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ళ మంజూరులో శంషాబాద్ మున్సిపాలిటీ టాప్

## 530 ఇళ్ళు మంజూరు



రాజేంద్రనగర్ (ప్రశ్న న్యూస్) రాజేంద్రనగర్ నియోజకవర్గం లో ఇందిరమ్మ ఇళ్ళ మంజూరులో శంషాబాద్ మున్సిపాలిటీ మొదటి స్థానంలో నిలిచింది. ఒక్కో నియోజక వర్గానికి మూడు వేలు ఇందిరమ్మ ఇళ్ళకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా అన్ని ప్రాంతాలలో ఆ ప్రాసెస్ చకచకా జరుగుతుంది. ఇందులో బాగంగానే రాజేంద్రనగర్ నియోజకవర్గం లో ను ఇందిరమ్మ ఇళ్ళకు ప్రజాపాలనలో ధరఖాస్తు చేసుకోగా శంషాబాద్ మున్సిపాలిటీ కి మొత్తం 530 ఇళ్ళకు గ్రీన్ సిగ్నల్ లభించింది. నియోజక వర్గంలో శంషాబాద్ మండలం, మున్సిపాలిటీ, బండ్లగూడ జాగీరు కార్పోరేషన్, మణికొండ, నార్సింగి మున్సిపాలిటీ లతో పాటు జిహెచ్ఎంసి పరిధిలోకి వచ్చే రాజేంద్రనగర్ సర్కిల్ లు వుండగా ఇందిరమ్మ ఇళ్ళ మంజూరులో శంషాబాద్ మున్సిపాలిటీ నుండి అధిక సంఖ్యలో లబ్ధిదారుల ఎంపిక జరిగిందనే చెప్పాలి. బండ్లగూడ జాగీరు కార్పోరేషన్, మణికొండ,నార్సింగి మున్సిపాలిటీ లలో మూడువందలలోపే ఇందిరమ్మ లబ్ధిదారులను గుర్తించగా శంషాబాద్ లో రెండింతలు లబ్ధిదారుల ఎంపిక చేశారు.అయితే ఎంపికైన లబ్ధిదారులలో 194 మంది కొన్ని కారణాల వలన క్యాన్సిలేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని కమీషనర్ సుమన్ రావ్ తెలిపారు. 313 మంది లబ్ధిదారులకు ఇళ్ళ పనులు జరుగుతున్నాయని ఇందులో 263 ఇళ్ళు బేస్ మెంట్ లెవల్ లో పనులు జరుగుతుండగా మరో 50 ఇళ్ళ పనులు స్లాబ్ లెవల్ కు చేరుకున్నాయని అన్నారు. క్యాన్సిలేషన్ కు పెట్టుకున్న వారికి సైతం వారి సమస్యను తెలుసుకుని వీలైనంత వరకు ఇళ్ళ నిర్మాణం చేపట్టేలా అందుకు అనువుగా చర్యలు తీసుకుంటున్నట్లు సుమన్ రావ్ తెలిపారు. ఆర్థికంగా ప్రభుత్వం ఇచ్చిన నిధులకు అదనంగా డబ్బు సమకూర్చుకోలేని పరిస్థితి వుండి క్యాన్సిలేషన్ పెట్టుకున్నట్లైతే అలాంటి వారికి డ్వాక్రా ద్వారా రుణాలు ఇప్పించి ఇళ్ళు కట్టుకునేలా ప్రయత్నం చేస్తున్నామని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళు అందటానికి అనువుగా చర్యలు తీసుకుంటున్నట్లు కమీషనర్ తెలిపారు.

# మందులు శస్త్ర చికిత్స లేని వైద్యం పిజియోథెరపీ

## – కలెక్టర్ రిజ్వాన్ భాషా





జనగామ(ప్రశ్న న్యూస్) ఫిజియోథెరపీ అంటే మందులు లేకుండా, శస్త్రచికిత్స లేకుండా, కేవలం శరీర వ్యాయామాలు, కదలికలు, ప్రత్యేక పరికరాల సహాయంతో చేసే చికిత్స అని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. ప్రపంచ పిజియోథెరపి దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జిల్లా వైద్యాధికారి డా. మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన వేడుకలో కలెక్టర్ మాట్లాడుతూ,ప్రమాదాలలో గాయపడినవారు, పక్షవాతం వచ్చినవారు, వెన్నునొప్పి, మెడనొప్పి, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నవారు, వృద్ధులు, క్రీడాకారులు అందరికీ ఇది అనుగ్రహం లాంటిది రోగి ఆత్మవిశ్వాసాన్ని పిజియోథెరపీ డాక్టర్ పెంచుతారనీ అన్నారు. ఇవాళ్టి యుగంలో సెడెంటరీ లైఫ్‌స్టైల్ అంటే ఎక్కువగా కూర్చునే జీవనశైలి కారణంగా వెన్ను, మెడ, మోకాళ్ల సమస్యలు పెరుగుతున్నాయి. ఇవి మందులతో పూర్తిగా తగ్గవు. సరైన ఫిజియోథెరపీతోనే శాశ్వత ఉపశమనం పొందవచ్చు. ఫిజియోథెరపీ డాక్టర్లు కేవలం శరీరానికి కాకుండా మనసుకూ ధైర్యం ఇస్తారు. రోగులు ఒక అడుగు కూడా వేయలేని స్థితి నుండి మెల్లగా నడవగలిగే స్థితికి చేరినప్పుడు, వారి కళ్లలో కనిపించే ఆనందం అది డాక్టర్లకు నిజమైన బహుమతి అని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పలువురు పిజియోథెరపీ డాక్టర్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు డాక్టర్లు పాల్గొని ప్రసంగించారు. డా. డి. దేవేందర్, డా. డి. శివ శంకర్ రావు, డా. పి. ప్రసాద్ డా. బి. మొగిలి, డా. ఎల్. అశోక్, డా. సి. హెచ్. రాజశేఖర్, డా. ఎన్. వసుమతి, డాక్టర్. ఎం. అనిత, డా. బి. అఖిల్ కృష్ణ, డా. బి. భార్గవి, డా. బి. సుమశ్రీ, డాక్టర్ జైషీలా తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక కాంట్రాక్టర్లకు అన్యాయం చేస్తున్న కరెంటు ఏఈ మురళి కృష్ణ

- స్థానిక కాంట్రాక్టర్లకు పనులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న ఏఈ మురళి కృష్ణ
- కరెంటు ఏఈ మురళీకృష్ణ నాన్ లోకల్ కాంట్రాక్టర్ల నుండి పెద్ద మొత్తంలో ముడుపులు
- స్థానిక కాంట్రాక్టర్లకు ఎస్టిమేట్ చేసి పనులు ఇవ్వడంలో జాప్యం ఎందుకు





కీసర ( ప్రశ్న న్యూస్) కీసర కరెంటు ఏఈ మురళీకృష్ణ నాన్ లోకల్ కాంట్రాక్టర్ల తో కుమ్మక్కై స్థానికంగా చేస్తున్నటువంటి కాంట్రాక్టర్లకు పనులు ఇవ్వకుండా నాన్ లోకల్ నుంచి వచ్చిన కాంట్రాక్టర్ల వద్దనుండి ముడుపులు తీసుకుంటూ పనులు కట్టబెట్టి స్థానిక కాంట్రాక్టర్ల పొట్ట కొట్టడం జరుగుతుందని మహేందర్ టీజీ ఎస్పీడీసీఎల్ క్యాపిటల్ వర్క్ కాంట్రాక్టర్ తెలిపారు.

ఈ సందర్భంగా మహేందర్ టీజీ ఎస్పీడీసీఎల్ క్యాపిటల్ వర్క్ కాంట్రాక్టర్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ కీసర కరెంటు డిపార్ట్మెంట్ ఏఈ మురళీకృష్ణ నాన్ లోకల్ కాంట్రాక్టర్లు ఇచ్చిన ముడుపులకు ఆశపడి పనులు కట్టబెట్టి లోకల్ కాంట్రాక్టర్ల పొట్ట కొట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. నాన్ లోకల్ కాంట్రాక్టర్లు పెట్టిన ఎస్టిమేట్లను త్వరగా ఎస్టిమేట్లు వేయడం జరుగుతుందని, స్థానిక కాంట్రాక్టులకు నెల పది రోజులు అయినా ఎస్టిమేట్ వెయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ స్థానిక కాంట్రాక్టర్లకు లేనిపోని కారణాలు చెబుతూ కాలయాపన చేస్తున్నాడని, నాన్ లోకల్ కాంట్రాక్టులకు అతి త్వరగా ఎస్టిమేట్ చేస్తూ కన్స్యూమర్ల దగ్గర పనులు ఇప్పిస్తూ నాన్ లోకల్ కాంట్రాక్టర్లతో ఏఈ మురళి కృష్ణ చేతులు కలిపి పనులు చేయించుకుంటున్నారని ఆయన తెలిపారు. స్థానిక కాంట్రాక్టర్ లకు పనులు రాకుండా అడ్డుపడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కన్స్యూమర్ల దగ్గర ఎస్టిమేట్లు లేట్ చేయడం వల్ల స్థానిక కాంట్రాక్టుల విలువలు తగ్గిస్తూ నాన్ లోకల్ కాంట్రాక్టర్లకు అతి త్వరగా ఆగమేఘాల మీద ఎస్టిమేట్ పంపడం జరుగుతుందని, నాన్ లోకల్ కాంట్రాక్టర్లు అధికారులు స్థానిక కాంట్రాక్టులు రాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని స్థానికంగా ఉన్నటువంటి కాంట్రాక్టర్లకు పనులు వచ్చేలా చూడాలని గతంలో ఇచ్చినటువంటి పనులు అన్ని సకాలంలో పూర్తి చేశామని ఆయన తెలిపారు. స్థానికంగా ఉన్నటువంటి కాంట్రాక్టర్లు ఏఈ మురళీకృష్ణ అడిగిన డబ్బులు ఇవ్వకపోవడంతో స్థానికంగా ఉన్నటువంటి కాంట్రాక్టర్లకు పనులు రాకుండా ఎస్టిమేట్ చేయడంలో కాలయాపన చేస్తూ నాన్ లోకల్ కాంట్రాక్టర్లకు పనులు ఇప్పిస్తూ పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుంటున్నాడని ఆయన అన్నారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి స్థానిక కాంట్రాక్టర్లకు తగిన న్యాయం చేయాలని లేనట్లయితే కీసర కరెంట్ ఆఫీస్ ఎదుట ధర్నాకు దిగుతామని ఆయన ఉన్నతాధికారులకు హెచ్చరికలు జరిచేశారు.

# రోడ్డు ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు

- స్పీడ్ బ్రేకర్లు లేక పెరిగిన వాహనాల స్పీడు
- మచ్చుకైనా కనిపించని రోడ్ సేఫ్టీ అధికారులు
- హారీనా టవర్స్ వద్ద రిక్వెస్ట్ బస్ స్టాప్ ను ఏర్పాటు చేయండి
- స్పీడ్ బ్రేకర్ న ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- ప్రజల సమస్యలు పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రోడ్డు రవాణాలో ప్రజల సేఫ్టీ విషయంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్లపై విపరీతంగా పెరిగిన ట్రాఫిక్ వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నది అందరికీ తెలిసిన విషయమే కానీ దానిని నివారించడానికి అధికారులకు కనీస ఆలోచన లేకపోవడంతో ప్రమాదాలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. రోడ్డు దాటే విషయంలో ప్రజలు పలు ప్రమాదాలకు గురై ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు కొంతమంది మాత్రం రోడ్డు ప్రమాదాల వల్ల ఆసుపత్రుల బిల్లు కట్టలేక ఉన్న ఇండ్లు%ఓ% స్థలాలు అమ్ముకోవడంతో పాటు అప్పుల పాలవుతున్నారు. అయిన మన అధికారులకు రోడ్ సేఫ్టీ ఏర్పాటు చేయాలన్న చిత్తశుద్ధి లేకపోవడం ప్రజల దౌర్భాగ్యంగా మారింది. నగరంలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయకపోవడంతో ద్విచక్ర, కార్లు, బస్సుల వాహనాదారులు ఇస్తారాజ్యంగా వాహనాలను నడిపి అనేక ప్రమాదాలు చేస్తున్నారు. చాలామందికి వాహనాలు సురక్షితంగా నడపాలన్న చిత్తశుద్ధి లేకపోవడం ఒక వంతు అయితే ట్రాఫిక్ లో త్వరగా వెళ్లాలన్న ఆతృతతో వాహనాలను ఇస్తారాజ్యంగా నడిపిస్తున్నారు. దానితో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఉప్పల్ హారీనా టవర్స్ వద్ద రిక్వెస్ట్ బస్ స్టాప్ ను ఏర్పాటు చేయాలని, స్టాప్ డివైడర్ ని రోడ్డు పై ఏర్పాటు చేయాలని, రోడ్డు దాటేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రభుత్వ ఉన్నత అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుచున్నారు.ఉప్పల్ హారీనా టవర్స్ లో ఉద్యోగాలు చేసే యువత రోడ్డు అటు ఇటు దాడేటప్పుడు ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువ ఉన్నందున అక్కడ స్పీడ్ బ్రేకర్లను, రిక్వెస్ట్ స్టాప్ ను ఏర్పాటు చేయాలని ఉద్యోగులకు ర ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే రోడ్డు రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారుతుందని ఇప్పటికైనా ఈ సమస్యపై వెంటనే స్పందించి సత్వరమే సమస్యకు పరిష్కారం తెలపాలని కోరుచున్నారు.

### ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

## కొడపాక గ్రామ ఉన్నత పాఠశాలలో



మెదక్(ప్రశ్న న్యూస్)పాపన్నపేట్ మండలం కొడపాక గ్రామ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండవీటీ ఆరోగ్యం అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల అధికారులు పురప్రముకులు హాజరయ్యారు ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీత పాఠశాలకు ప్రదానోపాధ్యాయురాలు కొండవీటీ ఆరోగ్యం. అవార్డు గ్రహితలను సన్మానించారు మరియు సీనియర్ ఉపాధ్యాయులు ప్రవీణ్.. వెంకటరమణ. నాగేశ్వరరావు.నాయుడు. వెంకటరెడ్డి. శ్రీనివాస్. రమేష్. దత్త్రేయ. చంద్రశేఖర్ గౌడ్. లక్ష్మీనారాయన .లను విద్యార్థులు తల్లితండ్రులు ఘనంగా సత్కరించడం జరిగింది ఈ సందర్భంగా జి హెచ్ యం మాట్లాడుతూ ఉపాధ్యాయులతోనే నాణ్యతమైన విద్య అంది దేశం పురోగతిలో పయనిస్తుందని, ఉపాధ్యాయులందరూ మంచి నిబద్ధత పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు అని పేర్కొన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్ లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధన అందిస్తున్నారని అన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులు కలిసి భోజనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ .. అంగన్వాడి టీచర్లు.విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహిస్తూ ఉపాధ్యాయులను సన్మానించారు

## ఎమ్మెల్యే సత్యం ప్రత్యేక చొరవతోనే కొత్తపేట రైతులకు మిడ్ మానేర్ పరిహారం అందజేత

- చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే సత్యం నిరంతర కృషి
- మాన్వాడ సింగిల్విండో చైర్మన్ : వేసిరెడ్డి దుర్గారెడ్డి



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) బోయినిపల్లి మండలం, కొత్తపేట గ్రామానికి చెందిన 75 మంది రైతులు మిడ్ మానేర్‌లో భూమి కోల్పోయిన నేపథ్యంలో నిర్వాసితులకు రూ.79,84,370 నష్టపరిహారం అందుకున్నారు. నష్టపరిహారం మంజూరులో చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవ చేశారు.ఈ నేపథ్యంలో సదరు నిర్వాసిత రైతులు మాన్వాడ సింగిల్ విండో చైర్మన్ వేసిరెడ్డి దుర్గారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే సత్యంను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సింగిల్విండో చైర్మన్ వేసిరెడ్డి దుర్గారెడ్డి మాట్లాడుతూ, "రైతు సంక్షేమానికి,నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సత్యం నిరంతరం కృషి చేస్తున్నారని, ఎమ్మెల్యే సత్యం ప్రత్యేక చొరవతోనే నిర్వాసిత రైతులకు నష్టపరిహారానికి పరిష్కారం సాధ్యమైంది" అని పేర్కొన్నారు.

## రోకటి సురేష్ మరణం అత్యంత బాధాకరం..!!

- జూలూరుపాడు సీనియర్స్ ప్రెస్ క్లబ్ సభ్యులు..





జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) సెప్టెంబర్ 08: ప్రజాదరణ పొందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీటీసీ, రోకటి సురేష్ అకాల మరణం అత్యంత బాధాకరమణి జూలూరుపాడు సీనియర్స్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ కొలిపాక చంద్రశేఖర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సురేష్ మరణానికి చింతిస్తూ తన సంతాపాన్ని ప్రకటించారు. సురేష్ మరణం కాంగ్రెస్ పార్టీ కి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి రాజకీయాల్లో అంచలంచెలుగా ఎదిగిన రోకటి సురేష్. ఎంతో సౌమ్యుడిగా, ప్రజానేతగా పేరు సంపాదించారని తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, నియోజకవర్గం సీనియర్ రాజకీయనేతగా రోకటి తనదైన స్థానాన్ని సంపాదించుకున్నారని సీనియర్స్ ప్రెస్ క్లబ్ సభ్యులు రోకటి సురేష్ జ్ఞాపకాలను స్మరించుకున్నారు. రోకటి సురేష్ ని కాపాడుకునేందుకు వైద్యులు చేసిన కృషి, పార్టీ తరపున చేసిన ప్రయత్నాలు ఫలించక పోవడం దురదృష్టకరమని ప్రెస్ క్లబ్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రోకటి సురేష్ మరణంతో శోకతప్తులైన కుటుంబ సభ్యులు మిత్రులు అభిమానులకు సీనియర్ ప్రెస్ క్లబ్ సభ్యులు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సురేష్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్బంగా సీనియర్స్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చాపలమడుగు నరసింహారావు, కోశాధికారి షేక్ బడెన్ పాషా, సంయుక్త కార్యదర్శి నల్లగట్ల దిలీప్ కుమార్, గౌరవ అధ్యక్షులు సంఘం నాగరాజు, గౌరవ సలహాదారులు అన్నవరపు జస్వంత్ కుమార్, ముఖ్య సలహాదారులు ఉసికల రమేష్, భూక్యా రత్న కుమార్, కృష్ణ ప్రసాద్ తదితరులు రోకటి సురేష్ కు నివాళులర్పించారు.

### బోయిన్ పల్లి మార్కెట్లో

# చెత్తతో మంచాన పడ్డ హమాలన్న

- మార్కెట్లో దుర్గంధ పూరితమైన చెత్తను తరలించి హమాలీల ఆరోగ్యాన్ని కాపాడాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ డిమాండ్
- పట్టించుకోని అధికారులు, పెరుకుపోతున్న చెత్త చెదారం
- కూళ్లిన కూరగాయలు, కన్నీళ్లు పెట్టుకుంటున్న కమీషన్ దార్లు

"మార్కెట్లో పెరుకుపోయిన చెత్త,పరిషాన్ మాకు పైసల్ మీకు,వెయ్యిల్లో హమాలీలు, గత రెండు వారాలుగా విరోచనాలు,వాంతులు,జ్వరం టైఫాయిడ్,డెంగ్యూతో బాధపడుతున్న హమాలీలు"








కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో గత పది రోజులుగా మార్కెట్లో చెత్త చెదారం కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తుంది.పక్షం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు కూరగాయలు తడిసి ముద్దయ్యినా చెత్త కుప్పలో నుంచి తొలగించికపోవడంతో దుర్వాసనతో పాటు దొమలకు అడ్డాగా మారింది.ఈ నేపథ్యంలో బోయిన్ పల్లి మార్కెట్ లో సుమారు రెండు వేల పైచిలుకు ఉండే హమాలీలు, గత పది రోజులుగా ఒకరి తర్వాత మరొకరు మంచాన పడుతున్నారు. కారణం అధికారుల నిర్లక్ష్యం.గత నెల రోజులుగా మార్కెట్లో చెత్తను తరలించకపోవడం మార్కెట్ పరిసరాలుశు భ్రపరచకపోవటం వలన బోయిన్ పల్లి మార్కెట్లో ఎక్కడి పడితే అక్కడ చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతూ రోగాలకు వేదికగా మారింది.దీని వల్ల మార్కెట్లో ఇరవై నాలుగు గంటలు పనిచేసే హమాలీలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ విమర్శించారు. నిన్న బోయిన్ పల్లి మార్కెట్ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో మార్కెట్ పరిసరాల్లో నెలల తరబడి పేరుకుపోయి మురుగు వాసన వస్తున్నటువంటి చెత్తను పరిసర ప్రాంతాలను హమాలీలతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో చెత్త తరలించే కాంట్రాక్టుకు గత ఐదు నెలలుగా బిల్లులు రావడం లేదని నేపంతో సంబంధిత కాంట్రాక్టర్ నెల రోజులకు పై బడి మార్కెట్లో చెత్తను తరలించటం లేదని తద్వారా ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయి తీవ్రదుర్గందాన్ని వెదజల్లుతుందని నర్సింహా ఆవేదన వ్యక్తంచేశారు.చెత్తను తరలించే విషయంలో మార్కెట్ అధికారులు చొరవ చూపకపోవడం వలన మార్కెట్లోపనిచేస్తున్న అమాలీలు, మార్కెట్ కి వస్తున్న ఖరీదు దారులు, రైతులు వ్యాపారులు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారని,అలాగే మార్కెట్ అధికారుల నిర్లక్ష్యం కళ్లకు కన్పిస్తుందని ఆయన తెలియజేశారు.
మార్కెట్ కు ప్రతి రోజు సుమారు ఇరవై ఐదు వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు.వివిధ రాష్ట్రాల నుంచి రకరకాల కూరగాయలు ముప్పై వేల టన్నుల కొద్దీ కూరగాయలు మార్కెట్ కు వచ్చే సందర్భంలో ప్రతిరోజు రెండు లేదా మూడు టన్నుల కూరగాయలు కుళ్లిపోవటం వలన చెత్త జమ అవుతుంది. ఎక్కడ చూసినా కుప్పలు తెప్పలుగా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.ఆ చెత్త కుప్పలు మురిగి వాసన వస్తు పురుగులు పడి అక్కడ ఉండే విధులు నిర్వహిస్తున్న హమాలీలు అనారోగ్య బారిన పడి ఆసుపత్రి పాలయ్యారు. కొంతమంది పరిస్థితి చాలా దారుణంగా ఉందని, ఎవ్వరికైనా ఏమైనా అవుతే అధికారులదే బాధ్యత అన్నారు ఎఐటియుసి కార్యదర్శి నర్సింహా.ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ ని గొప్పాలు చెప్పుకునే అధికారులు కార్యాలయానికి పరిమితం కాకుండా ఫీల్డ్ లో ఉంటే పరిస్థితిలు ఇలా ఉండవని,ఈ విషయం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి సురేందర్ మోహన్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు.ఇంత పెద్ద మార్కెట్ కి ఆదాయం వస్తున్నప్పటికీ మార్కెట్ పరిసరాలు పరిశుభ్రపరిచేందుకు పాలకమండలి,అధికారులు చొరవ చూపకపోవడం వల్ల ఇన్ని అనర్థాలకు దారితీస్తుంద.ఇప్పటికైనా ఆఫీసర్స్,కమిటీ కలిసి క్షేత్రస్థాయిలో ఆలోచిస్తే మరికొందరు హమాలీల ప్రాణాలు కాపాడిన వారౌతారు. లేక పోతే బోయిన్ పల్లి మార్కెట్ కి వచ్చి పోయే వారు అనారోగ్యంతో తీవ్ర ఇక్కట్లకు గురికాక తప్పదు. చెత్త పేరుకుపోవడం వలన పెద్ద ఎత్తున దోమలు వచ్చి రాత్రి డ్యూటీలో ఉన్న హమాలీలను కరవడం వలన హమాలీలు డెంగ్యూ మలేరియా వంటి వ్యాధుల బారిన పడుతు వేలాది రూపాయలు ఆస్పత్రులకు ఖర్చు చేసుకోవాల్సి దుస్థితి నెలకొంది.నెలల తరబడి చెత్త పేరుకు పోతున్నప్పటికీ సమస్యను పరిష్కరించకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.
మార్కెట్ పరిసరాలు శుభ్రపరిచి దోమలు రాకుండా చేయని పక్షంలో హమాలీలు రాత్రిపూట డ్యూటీలకు పడుకునే పరిస్థితి లేదని ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో నైట్ డ్యూటీలు హమాలీలు చేసే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు.తక్షణం అధికారులు చొరవ తీసుకొని మార్కెట్లో మౌలిక వసతులు కల్పించాలని దోమల నివారణ చర్యలు చేయాలని మురుగు దుర్గంధం వెదజల్లకుండా శుభ్రపరచాలని నర్సింహా ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హమాలి యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఏ గట్టయ్య, రాజు,మహేందర్,లింగం, రాజయ్య,కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

### నేను నా జనం,వారే నా ప్రాణం

# "కంటోన్మెంట్ వాణి"ఎమ్మెల్యే

- నియోజకవర్గంలో ప్రజల సమస్యలకు వేదిక "సీ వాణి"

ప్రతి నెల 10 వ తేదీన,8 వార్డులు,డివిజన్లో అన్ని విభాగాల అధికారులతో సమీక్ష

- నాయకులు కాదు,ప్రజలు ముఖ్యం.చేసే పనులు వారికి నచ్చాలే
- చరిత్రను తిరగరాస్తున్న ఎమ్మెల్యే,"సీ వాణిలో జిల్లా కలెక్టర్ అట్రాక్షన్ గా నిలుస్తారు
- బోర్డు ఎన్నికలు రావు,స్థానిక సమస్యలకు చెక్ పెట్టాలంటే కంటోన్మెంట్ వాణి తో పరిష్కారం ఎమ్మెల్యే శ్రీ గణేష్
- కంటోన్మెంట్లో మౌలిక వసతుల పై ఇక ఎమ్మెల్యే,అధికారులు "సీ వాణి"లో చర్చ






కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఈ నెల పదవ తారీఖున జరగబోతున్న "కంటోన్మెంట్ వాణి"పై బోయిన్ పల్లిలో ఉన్న కంటోన్మెంట్ ఇండోర్ స్టేడియం గ్రౌండ్ లో ఏర్పాట్లను పరిశీలించారు.కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎనిమిది వార్డులు,మోండా డివిజన్ ఉన్న విషయం అందరికి తెలిసిందే! సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో గత ఆరు సంవత్సరాలుగా బోర్డు ఎన్నికలు జరగకపోవడం వల్ల ప్రజల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.రక్షణ మంత్రిత్వ శాఖ బోర్డు ఎన్నికలు నిర్వహించక పోవడంతో నియోజకవర్గం ప్రజలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సమస్యలు పత్రాలతో క్యూ కడుతున్నారు.సుమారు పది కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం.పాపం ప్రజలు ఆటోలు,ఆర్టీసీ బస్సుల్లో వచ్చి మరి స్థానిక ఇబ్బందులు పై ఎమ్మెల్యే శ్రీ గణేష్ తో భేటీ అవుతున్నారు.ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రజల సమస్యలు చూసి చలించిపోయారు,ఆయన ఓ అద్భుతమైన ఆలోచనతో ప్రజల మధ్యలోకి వస్తున్నారు.అదే "కంటోన్మెంట్ వాణి"బోర్డు పరిధిలో ఉన్న ఎనిమిది వార్డుల్లో ప్రతి నెల 10 వ తేదీన వేదిక ఏర్పాటు చేస్తారు.ఈ కార్యక్రమంలో బోర్డు ఇంజనీరింగ్ అధికారులు వాటర్ డిపార్ట్మెంట్,శానిటేషన్ విభాగం,హెల్త్ డిపార్ట్మెంట్ అధికారులు వీరితోపాటు జిల్లా యంత్రాంగం కూడా పాల్గొనడం విశేషం.మరో విషయం ఏమిటంటే కంటోన్మెంట్ లోకాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంచి జోష్ ఇస్తున్నారు ఎమ్మెల్యే శ్రీ గణేష్.దశల వారీగా నియోజకవర్గంలో నెలకొన్న మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా కంటోన్మెంట్ వాణి లో అన్ని సమస్యలకు చెక్ పెట్టడానికి ఎమ్మెల్యే శ్రీ గణేష్ భీష్మించుకున్నారు.రేపు బుధవారం జరగబోయే "సీ వాణి"లో ఎన్ని సమస్యలు పరిష్కరిస్తారో వేచిచూడాల్సిందే! కానీ స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ చేసే ప్రయత్నాలను అభినందించాల్సిందే ఎందుకంటే గతంలో నియోజకవర్గంలో ఏ ఎమ్మెల్యే ఈ విధమైన ఆలోచనతో ముందుకు రాలేదు.ప్రస్తుతం ఎమ్మెల్యే తీసుకునే ప్రతి నిర్ణయం స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.కాలనీ, బస్తీల్లో ఉండే చోట బడా నేతలు మౌలిక సమస్యలు పరిష్కరం కాక తలలు పట్టుకున్న రోజులు లేకపోలేవు.ఈ కార్యక్రమం "కంటోన్మెంట్ వాణి "ద్వారా ప్రజలకి మరింత దగ్గరైయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.ఒకవేళ ఎమ్మెల్యే చేపట్టిన సీ వాణి సక్సెస్ అవుతే మాత్రం ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా మిగిలిపోతారు లీడర్లు.జిల్లా కలెక్టర్ "సీ వాణి"లో స్పెషల్ అట్రాక్షన్... బోయిన్ పల్లి కంటోన్మెంట్ ఇండోర్ స్టేడియంలో జరగబోయే కంటోన్మెంట్ వాణి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైతున్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరి చందన.స్థానికఎమ్మెల్యే శ్రీ గణేష్ కంటోన్మెంట్ వాణికి జిల్లా కలెక్టర్ ని ఆహ్వానించినట్లు విశ్వసనీయ సమాచారం.సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గానికి నైరుతి భాగంలో ఉన్న బోయిన్ పల్లి నుంచి "సీ వాణి"కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్.సెప్టంబర్‌పదవ తారీఖు బుధవారం ఉదయం 10:30 కు కంటోన్మెంట్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభం కానుంది.ఒకటవ వార్డుకు చెందిన ప్రజలు తరలివచ్చి వారి సమస్యలు "కంటోన్మెంట్ వాణి"దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే శ్రీ గణేష్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఇంజనీరింగ్,పోలీస్,రెవిన్యూ, ఎలక్ట్రిసిటీ ,హెల్త్ డిపార్ట్మెంట్స్ అధికారులు,కంటోన్మెంట్ బోర్డ్ సీఈవో,కంటోన్మెంట్ బోర్డు లోని అన్ని డిపార్ట్మెంట్స్ అధికారులు పాల్గొంటున్నారని ప్రజలందరు ఈ అవకాశాన్ని ప్రజలందరు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణు గోపాల్ రెడ్డి,సదా,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ముప్పిడి మధుకర్, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు శరత్, టి పిసిసి సెక్రటరీ రాజేష్ యాదవ్,శాంన్సర్ రాజు,గణేష్
టెంపుల్ చైర్మన్ యాదవ్, సంతోష్ యాదవ్,ఉత్తరయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోకటి సురేష్ భౌతికకాయానికి నివాళులర్పించిన బీఆర్ఎస్ నాయకులు..!!

- యల్లంకి సత్యనారాయణ, లకావత్ గిరిబాబు..



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) సెప్టెంబర్ 08: పాపకొల్లు మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రోకటి సురేష్ మరణించిన విషయం తెలుసుకొని స్వగృహంలో సురేష్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబానికి పరామర్శించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు యల్లంకి సత్యనారాయణ, వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు. వారితో పాటు సొసైటీ మాజీ చైర్మన్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు పోలుదాస్ కృష్ణమూర్తి, మాజీ జెడ్పీటీసీ భూక్యా కళావతి, సేవా సొసైటీ డైరెక్టర్లు చాపలమడుగు రామ్మూర్తి, రెడ్డిబోయిన రాము, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు దుద్దుకురి కృష్ణ ప్రసాద్, తాళ్లూరి రామారావు, రామకృష్ణ, పోతురాజు కృష్ణ, గుమ్మడి వెంకటేశ్వర్లు, మద్దిశెట్టి ప్రకాష్, తాళ్లూరి నవీన్ మరియు తదితరులు నాయకులు పాల్గొన్నారు

## కోలీవుడ్‌లో బంపర్ ఆఫర్

# అందుకున్న శ్రీదేవి



యంగ్ హీరోయిన్ శ్రీదేవి అప్పల 'కోర్టు' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో ఇందులో నటించిన శ్రీదేవికి ఫుల్ పాపులారిటీ వచ్చింది. ప్రస్తుతం ఈ అమ్మడు తమిళ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. కేజీఆర్‌కు జోడీగా నటిస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. త్వరలోనే షూటింగ్ స్టార్ట్ కాబోతుంది. ఈక్రమంలో.. తాజాగా, శ్రీదేవికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఆసక్తిని పెంచుతోంది. ఈ భామ కోలీవుడ్‌లో మరో బంపర్ ఆఫర్ అందుకున్నట్లు పలు పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. కోలీవుడ్ యంగ్ డైరెక్టర్ కెన్ కరుణాస్ హీరోగా నటిస్తున్న సినిమాలో శ్రీదేవి హీరోయిన్‌గా చేస్తున్నట్లు టాక్. స్కూల్ బ్యాక్ డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రంలో అనిష్మా, ప్రియాంశి యాదవ్, సూరజ్ వెంజరమూడు కీలక పాత్రలో నటిస్తుండగా.. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు 'కాదలన్' టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్లు టాక్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు నెట్టింట వైరల్ అవుతుండగా.. శ్రీదేవి బంపర్ ఆఫర్ అందుకుందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# త్రిష ఆసక్తికర కామెంట్స్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష 'విశ్వంభర' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మెగాస్టార్, వశిష్ట కాంబోలో రాబోతున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. సోసియో-ఫాంటసీ కథతో రాబోతున్న ఈ సినిమా వచ్చే ఏడాది సమ్మర్ స్పెషల్‌గా విడుదల కాబోతుంది. ఇదిలా ఉంటే.. తాజాగా, ప్రతిష్ఠాత్మక సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ 2025 వేడుకలకు త్రిష హాజరైంది. దుబాయ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో.. 2024 సంవత్సరంలో తమ సత్తా సాటిన నటీనటులు, మూవీ యూనిట్స్‌కు ఈ అవార్డులు ప్రకటించారు. ఇక ఇందులో అవార్డు సొంతం చేసుకున్న త్రిష మాట్లాడుతూ.. "2012 నుంచి నేను సైమాకు హాజరవుతున్నాను. ఇది నిజంగా చాలా అభివృద్ధి చెందింది. మాకు ఇంట్లో ఉన్నట్లు అనిపించేలా చేస్తారు. నాలుగు పరిశ్రమలకు సంబంధించిన సెలబ్రిటీలు కలుసుకునే సైమా వేడుకలు అంటే నాకు చాలా ఇష్టం. తరచుగా తమిళ అవార్డులు ఇస్తారు.. కానీ సైమా అవార్డులోనే ప్రతి ఒక్కరినీ చూడొచ్చు. ఇది చాలా ప్రత్యేకమైనది.. ఎప్పటికీ మర్చిపోలేని క్షణాలు మాకు అందిస్తుంది. నా ప్రయాణంలో భాగమైన నా దర్శకులు, నిర్మాతలు, నటులు, సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను. నేను చేసిన కొన్ని చిత్రాల గురించి నేను చాలా గర్వపడుతున్నాను. కొన్ని సినిమాలు గొప్ప పాఠాలు నేర్పించాయి. నేను నిజమైన ప్రేమను పొందాను. నాకు చాలా సంతోషంగా ఉంది. ఇక నుంచి ఇంకా బాగా నటించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఎల్లప్పుడూ నా వెనకాలే ఉంటూ నన్ను ప్రోత్సహిస్తున్నందుకు నా ప్రియమైన శ్రేయోభిలాషులు, అభిమానులు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.



## నరకం అంటూనే

# టికెట్లు కొంటున్నారు



ఇటీవలే విడుదలైన బాలీవుడ్ మూవీ భాగీ 4కి యునానిమస్ గా నెగటివ్ టాక్, రివ్యూలు వచ్చేశాయి. మితిమీరిన హింస, తలాతోకా లేని కథా కథనాలతో థియేటర్లో కూర్చుకున్న ప్రేక్షకులతో నరకం స్పెల్లింగ్ రాయించిందనే కామెంట్ చాలా చిన్నదని చెప్పాలి. హీరో టైగర్ శ్రోఫ్ రెండున్నర గంటల పాటు దైవాంశ సంభూతుడిలా వేల కొద్ది బుల్లెట్లు, వందల కత్తిపోట్లు తగిలించుకునా నిటారుగా నిలబడి ఫైట్లు చేసిన వైనం మంచి ట్రోలింగ్ మెటీరియల్. సంజయ్ దత్ ఈ మూవీలో నరికిన చేతులు, తలలు లెక్కబెట్టాలంటే ఒక అయిదారుగురు లెక్కల టీచర్లకు డబ్బులిచ్చి మరీ కూర్చోబెట్టాలి. అయినా వాళ్ళు కరెక్ట్ గా చెప్పలేరు. ఇంత తేడా కంటెంట్ ఉన్న భాగీ 4 ఈ ఫ్రాంచైజ్ కి మాస్ లో ఉన్న ఫాలోయింగ్ వల్ల వీకెండ్ వరకు బాగానే వసూళ్లు రాబట్టింది. ట్రేడ్ లెక్కల ప్రకారం ఆదివారం రాకముందే ఇరవై నాలుగు కోట్లకు పైగా వసూలు చేయడం విచిత్రమే. అలాని జనాలు దీని గురించి పాజిటివ్ గా చెప్పడం లేదు. సోషల్ మీడియా వేదికగా తలంటుతూనే ఉన్నారు. దీంతో పాటే విడుదలైన ది బెంగాల్ ఫైల్స్ లో వివాదాస్పద అంశాలు, తెలుసుకోవాల్సిన సత్యాలు చాలా ఉన్నా ఆడియన్స్ దానికి దూరంగా ఉన్నారు. స్టార్లు లేకుండా మరీ మూడున్నర గంటల పాటు దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి చెప్పిన కథ డాక్యుమెంటరీ ఫీలింగ్ ఇచ్చింది. క్రిటిక్స్ ని ది బెంగాల్ ఫైల్స్ మెప్పించినప్పటికీ కమర్షియల్ గా మాత్రం డిజాస్టర్ వైపు వెళ్తోంది. దానికి భాగీ 4 కారణం కాదు కానీ నిడివి పెద్ద దెబ్బ కొట్టింది. అన్నట్టు భాగీ సిరీస్ లో ఇప్పటిదాకా వచ్చినవన్నీ రీమేకులే కావడం గమనార్హం.

భాగీకి పునాది పడింది ప్రభాస్ వర్షంతో. భాగీ 2 కోసం అడవి శేష్ క్షణంని తీసుకున్నారు. భాగీ 3కి నాగచైతన్య తడాకా ఉపయోగపడింది. ఇప్పుడు భాగీ 4కి తమిళ మూవీ ఐయితు ఐయుతు ఐయుతుతో పాటు గోపీచంద్ ఒంటరి, బాలకృష్ణ లయన్ ని వాడుకున్నారు. అయినా ఉత్తరాది ప్రేక్షకులు మహా వెరైటీ. కొన్నిసార్లు తేడాగా ఉన్న డిజాస్టర్లకు కూడా కాసులు కురిపించేస్తారు.

# మళ్లీ అదే స్టోరీ...ఇక్కడ ఫ్లాప్ అక్కడ హిట్



ఒకప్పుడు తమిళ సినిమాల క్వాలిటీనే వేరుగా ఉండేది. మార్కెట్ పరంగా రేంజ్ తక్కువ కావచ్చు కానీ.. కంటెంట్ క్వాలిటీ మాత్రం ఇండియాలో ఏ ఇండస్ట్రీకి తీసిపోని స్థాయిలో అక్కడి సినిమాలుండేవి. అక్కడ అనేక ప్రయోగాలు జరిగేవి. కమర్షియల్ సినిమాల్లోనూ వైవిధ్యం చూపించేవాళ్లు. రొటీన్ సినిమాలను పెద్దగా పట్టించుకునే వాళ్లు కాదు. కానీ గత దశాబ్ద కాలంలో మొత్తం మారిపోయింది. తమిళ సినిమాల క్వాలిటీ బాగా పడిపోయింది. ఒకప్పుడు అద్భుతమైన సినిమాలు అందించిన శంకర్, మణిరత్నం, మురుగదాస్ లాంటి దర్శకుల నుంచి పేలవమైన సినిమాలు వస్తున్నాయి.మురుగదాస్ సంగతే తీసుకుంటే.. 'స్పైడర్' దగ్గర్నుంచి ఆయన వరుసగా డిజాస్టర్లు డెలివర్ చేస్తున్నాడు. ఈ ఏడాది బాలీవుడ్లో ఆల్రెడీ 'సికందర్' సినిమాతో షాక్ తిన్నాడు మురుగదాస్. తమిళంలో తీసిన 'మదరాసి'తో ఆయన పుంజుకుంటాడేమో అని అభిమానులు ఆశించారు. ఐతే ఈ సినిమాకు కూడా డివైడ్ టాక్ తప్పలేదు. మురుగదాస్ గత చిత్రాలతో పోలిస్తే కొంచెం బెటర్ అనే టాక్ వచ్చింది తప్ప.. ఓవరాల్‌గా ఇది మెప్పించే సినిమా అయితే కాదు. విపరీతమైన సాగతీత.. యాక్షన్ ఎపిసోడ్లు తప్ప విషయం లేని బోరింగ్ సెకండాఫ్ సినిమాకు పెద్ద మైనస్ అయింది. తెలుగులో ఈ సినిమాకు ఆరంభం నుంచి ఆశించిన వసూళ్లు లేవు. రెండో రోజు సినిమా మరింత వీక్ అయింది. ఇక్కడ 'మదరాసి' ఫ్లాప్ అని తేలిపోయింది. కానీ తమిళంలో మాత్రం 'మదరాసి' వీకెండ్లో బాగా ఆడుతోంది. శుక్ర, శనివారాల్లో ఈ చిత్రం తమిళంలో మంచి ఆక్యుపెన్సీలతో నడిచింది. ఆదివారం కూడా చెన్నై సహా మేజర్ సిటీస్‌లో 'మదరాసి' స్ట్రాంగ్‌గానే కనిపిస్తోంది.

## రెండ్రోజుల్లో బ్రేక్ ఈవెన్..

# టికెట్లు దొరకట్లేదు



ఈ వీకెండ్లో లిటిల్ హార్ట్స్ అనే చిన్న సినిమా రిలీజవుతుంటే.. ఘాటి లాంటి క్రేజీ కాంబినేషన్లో తెరకెక్కిన చిత్రం ముందు ఇది ఏమాత్రం నిలుస్తుందో అనుకున్నారు చాలామంది. అందులో హీరోగా నటించింది మీమ్స్ ద్వారా ఫేమస్ అయిన మౌళి. అతణ్ని మామూలుగా చూస్తే హీరో ఫీచర్స్ ఏమీ కనిపించవు. హీరోయిన్ శివాని నగరంది ఒక సినిమా అనుభవం. దర్శకుడు సైతం మీమ్స్ బ్యాగ్రౌండ్ నుంచి వచ్చిన వాడే. ఇలాంటి కాంబినేషన్లో తెరకెక్కిన చిత్రం.. అనుష్క, క్రిష్ కలయికలో తెరకెక్కిన ఘాటితో పాటు మురుగదాస్, శివ కార్తికేయన్ కాంబినేషన్లో రూపొందిన మదరాసిని కూడా వెనక్కి నెట్టేసింది. రెండో రోజు బుక్ మై షోలో లక్షకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయంటే ఈ సినిమా ఎంత స్ట్రాంగ్‌గా కొనసాగుతోందో అర్థం చేసుకోవచ్చు. రిలీజ్‌కు ముందు రోజే పెయిడ్ ప్రిమియర్స్ పడ్డాయి ఈ చిత్రానికి. దాన్నుంచే పాజిటివ్ టాక్ వచ్చింది. తొలి రోజు అది మరింత స్ప్రెడ్ అయింది. తొలి రోజు కోటిన్నర దాకా గ్రాస్ కలెక్ట్ చేసిన సినిమాకు.. రెండో రోజు వసూళ్లు ఇంకా పెరగడం విశేషం. ఈ సినిమా థియేట్రికల్ హక్కులను రూ. 2.5 కోట్లకు అమ్మినట్లు సమాచారం. ఆ మొత్తం షేర్ రూపంలో రెండు రోజులకే వచ్చేయడం విశేషం. ఇంత త్వరగా బ్రేక్ ఈవెన్ అయిన సినిమా ఈ మధ్య కాలంలో ఇదే కావచ్చు. ఈ చిన్న సినిమాను నమ్మి డిస్ట్రిబ్యూట్ చేసిన బన్నీ వాసు, వంశీ నందిపాటిల పంట పండినట్లే. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక యుఎస్‌లోనూ ఈ సినిమా అదరగొడుతోంది. శని, ఆదివారాల్లో ఈ సినిమాకు ఏపీ, తెలంగాణల్లోని మేజర్ సిటీస్‌లో మల్టీప్లెక్సులు, సింగిల్ స్క్రీన్లు అని తేడా లేకుండా హౌస్ ఫుల్స్‌తో రన్ అవుతోంది. హైదరాబాద్‌లో అయితే చాలా చోట్ల టికెట్లు దొరకని పరిస్థితి నెలకొంది. రెండో రోజు నుంచి లిటిల్ హార్ట్స్‌కు స్క్రీన్లు, షోలు అంతకంతకూ పెరుగుతున్నాయి.

# 9 సంవత్సరాల నాటి క్రిష్ కావాలి



దర్శకుడు క్రిష్ అంటే మూవీ లవర్స్ లో ప్రత్యేక గౌరవముంది. రెగ్యులర్ కమర్షియల్ ఫార్ములా జోలికి వెళ్లకుండా విభిన్నమైన కథలతో ఆలోచింపజేసే సినిమాలు తీస్తాడని ఎక్కువగా ఇష్టపడతారు. గమ్యం, వేదం, కృష్ణం వందే జగద్గురుమ్ కు ఇప్పటికీ బోలెడు కల్ట్ ఫాలోయింగ్ ఉంది. తన ముద్ర 2015లో వచ్చిన కంచెతోనూ కొనసాగింది. 2017లో గౌతమిపుత్రశాతకర్ణితో బాలకృష్ణకు మర్చిపోలేని వందో మూవీ ఇచ్చిన క్రిష్ ఆ తర్వాత ట్రాక్ తప్పారు. మణికర్ణిక నుంచి మధ్యలోనే బయటికి వచ్చేయడంతో కంగనా రౌనత్ తో పాటు డైరెక్షన్ కార్డుని పంచుకోవాల్సి వచ్చింది. అది యావరేజ్ కావడం వేరే విషయం. బాలయ్య ఫ్యాన్స్ ఎన్నో ఆశలు పెట్టుకున్న ఎన్టీఆర్ కథానాయకుడు, మహానాయకుడు రెండూ తీవ్రంగా నిరాశపరిచాయి. స్వర్గీయ ఎన్టీఆర్ గా బాలకృష్ణ నటన ఎంత అద్భుతంగా ఉన్నా మహానటి టైపు ట్రీట్ మెంట్ రాసుకున్న క్రిష్ ఆ స్థాయిలో మెప్పించలేకపోయారు. కొండపొలం సంగతి సరేసరి. చదవడానికి గొప్పగా అనిపించే నవలను తెరకెక్కించే క్రమంలో పడిన తడబాటుతో పాటు ఇంత హెవీ సబ్జెక్టుకి వైష్ణవ్ తేజ్ ని హీరోగా పెట్టడం ఆడియన్స్ తిరస్కారానికి కారణమయ్యింది. ఇక హరిహర వీరమల్లు గురించి తెలిసిందే. డిజాస్టర్ లో జ్యోతికృష్ణదే సింహ భాగమైనా క్రిష్ ప్రమేయాన్ని కొట్టి పారేయలేం. ఇప్పుడు ఘాటీ కూడా వీటి కోవలోకే చేరింది. తన సెన్సిబిలిటీకి ఏ మాత్రం సూటవ్వని గంజాయి స్మగ్లింగ్ బ్యాక్ డ్రాప్ ని తీసుకున్న క్రిష్ దాన్ని కనీసం యావరేజ్ అనిపించే స్థాయిలో తీయలేకపోయారు. అనుష్క విశ్వరూపం చూస్తారని పదే పదే చెప్పుకుంటూ వచ్చారు కానీ తన దర్శకత్వపు విశ్వరూపం కోసం ఎదురు చూసే ప్రేక్షకులు ఉన్నారని మర్చిపోయారు.

# ఇది కదా స్నేహమంటే



సినీ రంగంలో స్టార్ హీరోలు చాలా వరకు ఎవరికి వారే అన్నట్లుంటారు. ఏ ఇగోలు లేకుండా మంచి స్నేహితుల్లా సాగే స్టార్లు అరుదుగా కనిపిస్తారు. ఇక ఇండస్ట్రీలో అగ్రస్థానం కోసం పోటీ పడే హీరోల మధ్య స్నేహం అంటే మరీ అరుదు. కానీ తమిళంలో సూపర్ స్టార్ రజినీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్ దశాబ్దాలుగా తమ స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఈ ఇద్దరూ కలిసి సినిమా కూడా చేయబోతున్నారు. మరోవైపు మలయాళంలోనూ ఇద్దరూ టాప్ హీరోల మధ్య గొప్ప స్నేహం ఉంది. వాళ్లే.. మోహన్ లాల్, మమ్ముట్టి. వీరి అభిమానులు హిట్లు, కలెక్షన్లు, రికార్డుల గురించి బయట, సోషల్ మీడియాలో తెగ కొట్టేసుకుంటూ ఉంటారు కానీ.. ఆ ఇద్దరూ మాత్రం ఎంతో ఆత్మీయంగా మెలుగుతారు.ఒకరితో ఒకరికి పోటీ లేదు. అసూయకు అసలే అవకాశం లేదు. ఈ మధ్య మమ్ముట్టి అనారోగ్యం పాలైతే.. శబరిమలకు వెళ్లి తన మిత్రుడి కోసం ప్రత్యేకంగా మోహన్ లాల్ పూజలు చేయించడం వార్తల్లో నిలిచింది. ఇప్పుడు మరోసారి తన స్నేహితుడి మీద తన ప్రేమను చాటాడు మోహన్ లాల్. ఆదివారం మమ్ముట్టి 74వ పుట్టిన రోజును జరుపుకున్నారు. ఎప్పట్లాగే ఏ హడావుడి లేకుండా ఆయన బర్త్ డే జరిగిపోయింది. ఆయన బయటికి కూడా రాలేదు. ఐతే అదే సమయంలో మలయాళ బిగ్ బాస్ షోకు హోస్ట్ అయిన మోహన్ లాల్ వెరైటీగా తయారై వచ్చారు. ఆయన వేసుకున్న షర్ట్ అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆ చొక్కా మొత్తం మమ్ముట్టి బొమ్మలతో నిండిపోయింది. మమ్ముట్టి ఐకానిక్ సినిమాలు, క్యారెక్టర్లతో ఆ చొక్కాను డిజైన్ చేశారు. ఒక టాప్ స్టార్.. ఇంకో టాప్ స్టార్ బొమ్మలతో ఉన్న చొక్కా తొడుక్కుని ఇలా ఒక షోను హోస్ట్ చేయడం అరుదైన విషయం.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం - ప్రజల నుండి విశేష స్పందన

**-110 మందికి పరీక్షలు - 38 మందికి ఆపరేషన్ ఎంపిక**

**- లయన్స్ క్లబ్ అధ్యక్షులు : చీకోటి సంతోష్ కుమార్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో,రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మాతృశ్రీ హాస్పిటల్‌లో




జరిగిన ఈ శిబిరంలో 110 మందికి కంటి పరీక్షలు చేసి, 38 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు.ఎంపికైన వారిని ఉచిత బస్సులో రేకుర్తికి తరలించి ఆపరేషన్ చేస్తామని, ఆ తర్వాత మందులు, కంటి అద్దాలు, భోజనం ఉచితంగా అందిస్తామని వేములవాడ లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ బచ్చు వంశీకృష్ణ, లయన్ డాక్టర్ కోయినేని ప్రవీణ్, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కరాటే గ్రేడింగ్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలోని మహదేవ్ ఫంక్షన్ హాల్‌లో ఓకినవా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం కరాటే గ్రేడింగ్ టెస్ట్ ఘనంగా జరిగింది. అకాడమీ ఫౌండర్, చీఫ్ ఎగ్జామినర్ అబ్దుల్ మన్నాన్ పర్యవేక్షణలో జరిగిన ఈ పరీక్షల్లో 80 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు వివిధ బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు.కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు మైలారం రాము, రోమాల ప్రవీణ్ హాజరై విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "చిన్న వయసులోనే కరాటే వంటి యుద్ధకళలు నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢత్వం సాధిస్తారు" అని పేర్కొన్నారు.అకాడమీ గత 35 సంవత్సరాలుగా రాజన్న జిల్లాలో వేలాది మందికి శిక్షణ ఇవ్వడంతో పాటు, విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలకు తీర్చిదిద్దినట్లు వెల్లడించారు. అలాగే ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలలో జిల్లాకు అనేక పతకాలు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా మాస్టర్ అబ్దుల్ మన్నాన్ సేవలను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు దండగల తిరుపతి, లోలోపు రాజు, కనికరపు రాజశేఖర్, ఫర్హాన్ అబ్బాసి తదితరులు పాల్గొన్నారు.

# అగ్రహారం డిగ్రీ కళాశాలకు తరగతి గదుల కొరత

**- జేఎన్టీయూ కి వెంటనే సొంత భవనాన్ని నిర్మించాలి**

**- మల్లారపు ప్రశాంత్**

**- జిల్లా కలెక్టర్ కు ఎస్ఎఫ్ఐ వినతి పత్రం అందజేత**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ అర్బన్ మండలం,అగ్రహారం డిగ్రీ కళాశాలలో తరగతి గదుల కొరత విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. జేఎన్టీయూ కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో గత నాలుగేళ్లుగా డిగ్రీ కళాశాల భవనంలోనే ఇంజనీరింగ్ విద్యార్థులు కొనసాగుతున్నారు. ఇటీవల డిగ్రీ విద్యార్థుల సంఖ్య పెరగడంతో సమస్య మరింత తీవ్రమైంది.ఈ సమస్య పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ, "జేఎన్టీయూ కి సొంత స్థలం కేటాయించినా ఇప్పటి వరకు భవనం నిర్మించకపోవడం సిగ్గుచేటు. ఈ కారణంగా ఇరువురి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే చర్యలు తీసుకుని డిగ్రీ కళాశాల విద్యార్థులకు సరిపడా మౌళిక సదుపాయాలు, తరగతి గదులు కేటాయించాలి" అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సంజన, జిల్లా కమిటీ సభ్యులు శివ, డిగ్రీ కళాశాల విద్యార్థులు నివాస్, కార్తీక్, మహేష్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల సమయం ఆదా - పారదర్శకతకు ఈ-టికెటింగ్ వ్యవస్థ ఎంతో ఉపయోగం

**- ఆలయ ఈఓ : రమాదేవి**

**- వేములవాడ రాజన్నాలయంలో కోడె బుకింగ్‌కు "ఈ-టికెటింగ్" సేవ ప్రారంభం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి భక్తులకు మరింత సౌకర్యం కల్పించే దిశగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కోడె (రూ.200) బుకింగ్ కోసం ఈ-టీకెటింగ్ సేవను ఆలయ ఈఓ రమాదేవి సోమవారం ఘనంగా ప్రారంభించారు.ఈఓ వెంట ఆలయ పర్యవేక్షకులు నూగూరి నరేందర్,తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా ఈఓ రమాదేవి మాట్లాడుతూ, "భక్తుల సమయాన్ని ఆదా చేయడానికి, పారదర్శకతకు ఈ-టికెటింగ్ వ్యవస్థ చాలా ఉపయోగకరం. భవిష్యత్‌లో మరిన్ని సేవలను డిజిటల్ విధానంలో అందించడానికి చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.

# వేములవాడ దేవస్థానం అభివృద్ధి పనుల పురోగతి పై ఈఓ రమాదేవి పరిశీలన



వేములవాడ (ప్రశ్న న్యూస్)వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆలయ ఈఓ ఎల్. రమాదేవి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భీమేశ్వర ఆలయం, భీమేశ్వర సదన్ వసతి గృహం వద్ద కొనసాగుతున్న ఏర్పాట్లను తనిఖీ చేసి, పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి పనులను త్వరితగతిన ఉద్యోగులందరూ సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, పర్యవేక్షకులు శ్రీకాంత్ చార్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేట పోలీసులకు ఘన సన్మానం



ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) గణపతి నవరాత్రులను, గణేష్ నిమజ్జనాన్ని శాతీయుతంగా నిర్వహించుటలో తీవ్రంగా శ్రమించిన సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్ ఐ రాహుల్ రెడ్డితో పాటు పలువురు పోలీస్ కానిస్టేబుల్లను రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన నేతాజీ సేవా సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. వినాయక విగ్రహాల శోభయాత్ర వేడుకలలో భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాత్రింబగళ్ళు నిద్రహారాలు మాని విధులు నిర్వహించిన పోలీస్ అధికారులను, కానిస్టేబుల్ లను చాలా మంచిగా విధులు నిర్వహించారని ప్రశంసిస్తూ, వారందరిని నేతాజీ సేవా సమితి సభ్యులు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నేతాజీ సేవ సమితి అధ్యక్షులు దేవేష్ గౌడ్, మారవేణి రంజిత్ కుమార్, రామ్, వెంకటేష్ రెడ్డి, సాయి కృష్ణ, శ్రీనివాస్, వినయ్, అనుదీప్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

**108 వాహనంలో ఆసుపత్రికి తరలించిన స్థానికులు**



ఎల్లారెడ్డిపేట( ప్రశ్న న్యూస్) వెంకటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గాజులపల్లి వద్ద ఓ ద్విచక్ర వాహనం గోర్లను ఢీకొట్టడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గంభీరావుపేట నుండి సిరిసిల్ల వెళుతున్న ఓ ద్విచక్ర వాహనదారుడు ముందు వెళ్తున్న గొర్లను ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న తండ్రి కొడుకులకు తీవ్ర గాయాలు కాగా గొర్రెల కాపరికి కూడా తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# పి హెచ్ డి పట్టా అందుకున్న యువకుడిని సన్మానించిన ఫ్యాక్స్ చైర్మెన్



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) ఎనగందుల శ్రీను గణితంలో డాక్టరేట్ పట్టా పొంది గ్రామానికి రావడంతో అతడిని పలువురు శాలువాలతో సన్మానించారు. ఎల్లారెడ్డి పేట ఫ్యాక్స్ చైర్మెన్ గుండారపు కృష్ణారెడ్డి, గ్రామ అంబేద్కర్ నగర్ కాలని వాసులు, రాజేష్ ఫౌండేషన్ చైర్మెన్ రాజేష్ తో పాటు పలువురు ఫాస్టర్ లు శాలువాలతో గణాంగ సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు, ఫ్యాక్స్ చైర్మెన్ గుండారపు కృష్ణారెడ్డితో పాటు యమగొండ పద్మారెడ్డి, ముత్యాల ప్రభాకర్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన గణేష్ ఉత్సవ కమిటీ




నాచారం(ప్రశ్న న్యూస్) గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా ముగిసిన సందర్భంగా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. నాచారం పోలీస్ స్టేషన్ సిఐ రుద్వీర్ కుమార్, ఎస్సై వెంకటయ్యలను భాగ్యనగర్ ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి పోలీస్ సిబ్బందికి మిఠాయిలు పంచి కృతజ్ఞతలు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల నిర్వహణలో పోలీసుల కృషి ఎంతో అమూల్యమైనదని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎన్ సునీల్ రెడ్డి, కో కన్వీనర్లు బాలకృష్ణ, సంతోష్ రెడ్డి, రేవంత్, కిషోర్, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యం: మహేష్ కుమార్ గౌడ్



అంబర్ పేట (ప్రశ్న న్యూస్) పిసిసి అధ్యక్షునిగా మహేష్ కుమార్ గౌడ్ పదవి బాధ్యతలను చేపట్టి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని మరో పదేళ్ల పాటు అధికారంలో ఉండేందుకు శ్రమిస్తున్నానాని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అధికారంలోకి వచ్చాక పార్టీ ప్రభుత్వాన్ని జోడె ద్దుల్లా ముందుకు నడుపుతున్నామని స్పష్టం చేశారు.రాబోయే రోజుల్లోనూ పార్టీ, ప్రభుత్వం రెండింటినీ సమన్వయంతో ముందుకు తీసుకువెళ్తామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినప్పటి నుంచి అనేక ప్రజా సంక్షేమం పథకాలను అమలు చేశామని తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యవంతులను చేయాలని సూచించారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ప్రతిపక్ష నాయకులను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా మహేష్ కుమార్ కూడా అన్నారు.

# విద్యార్థుల అరెస్టులను ఖండించిన పట్టణ బీజేపీ

**- విద్యార్థులకు వెంటనే నూతన భవనం నిర్మించి, మౌళిక సౌకర్యాలు కల్పించాలి**

**- భాజపా పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్ డిమాండ్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా భాజపా వేములవాడ పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ, "అగ్రహారం డిగ్రీ కాలేజీలో ఇప్పటికే 500 నుంచి 600 మంది విద్యార్థులకు మాత్రమే వసతులు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జేఎన్టీయూ విద్యార్థులను అదే కాలేజీలో ఉంచడం సరికాదు" అని అన్నారు.ప్రభుత్వం నిజంగా విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలనుకుంటే, జేఎన్టీయూకు కేటాయించిన స్థలంలో కొత్త భవనాలు నిర్మించి తగిన మౌళిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తక్షణ చర్యలు తీసుకోవాలని రేగుల మల్లిఖార్జున్ కోరారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు సంటి మహేష్, అనిల్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఫూట్ పాత్ ఆక్రమణ

# అక్రమ అనుమత్తుల్లో ఎవరికి ఎంత వాటా

- ఫూట్ పాత్ ఆక్రమణలకు అధికారిక లైసెన్సులు
- ఫూట్ పాట్ నిబంధనలు పాటించని అధికార యంత్రాంగం
- జీచ్ఎంసీ ఆధికారుల కనుసన్నల్లో ఫూట్ పాత్ కబ్జాలు
- కంచే చేనును మేసిన చందంగా జీహెచ్ఎంసీ ఆధికారుల తీరు
- ఫూట్ పాత్ పై వ్యాపారాలు - రోడ్లపై పాధాచారులు
- డ్రగ్స్ కంట్రోల్ కార్యాలయ సమీప ఫుట్ పాత్ పై శాశ్వత కట్టడం పాపమెవరిది
- డబ్బుంటే నడిరోడ్డునైనా కబ్జా చేయవచ్చు
- రోత పుట్టిస్తున్న జీచ్ఎంసీ అధికారుల తీరు





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మహనగరంలో అవినీతిమయమైన జీఎచ్ఎంసీ ఆధికారుల అస్తవ్యస్థ పాలనతో ఫూట్ పాత్ అక్రమణల నుండి క్రమేపి ఫుట్పాత్లపై శాశ్వత నిర్మాణాల వరకు దారితీయడం విడ్డూరంగా మారింది. దీని వెనక జీఎచ్ఎంసీ అవీనీతి ఆధికారుల అండదండలున్నట్లు ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఉన్నత అధికారుల నిర్లక్ష్యం తీవ్ర స్థాయికి చేరడంతో జిహెచ్ఎంసి పాలన పూర్తిగా బ్రష్టు పట్టిపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే రద్దీ ఉండే ఎస్.అర్ నగర్, వెంగల్ రావు నగర్, అమీర్ పేట్ పరిసర ప్రాంతాలలో ఫూట్ పాత్ లను అన్యాక్రాంతచేసి యధ్ధేచ్ఛాగా వ్యాపారాలను నిర్వహిస్తుండగా వాటిని తొలగించాల్సిన అధికారులు డబ్బు కక్కుర్థితో దాడుల పేరిట నెలవారి వసూళ్ళకు నడుంబింగించడం దురదృష్టకరం. కంచే చేనును మేసిన చందంగా అక్రమ ఆక్రమణలకు పాల్పడే దళారీలు తమ ఆక్రమణలకు జీఎచ్ఎంసీ అధికారుల అనుమతులు ఉన్నాయని తమను ఎవరు ఏమి చేయలేరని భాహటంగా ఫూట్ పాత్ ల అక్రమణలకు పాల్పడుచుండడం గమనార్హం. ఇప్పటికే ఎస్.ఆర్ నగర్ పరిసరాలలో అధిక జనసాంధ్రత ఉన్న రహదారులలో ఫూట్ పాత్ లు అన్యాక్రాంతమై టీకొట్లు, పండ్ల వ్యాపారాలు, ఇతర చిన్నచిన్న వ్యాపారాలకు అడ్డాగా మారాయి. ఇదిలా ఉండగా ఎస్.అర్.నగర్ - ఈఎస్ఐ ప్రధాన రహధారిపై ఉన్న డ్రగ్స్ కంట్రోల్ కార్యాలయం, రాష్ట్ర క్షయ శిక్షణా కేంద్ర ప్రహరీ గోడనానుకొని ఉన్న ఫూట్ పాత్ ను ఆక్రమించుకొని ఏకంగా పిల్లర్లు వేసి శాశ్వత నిర్మాణానికి పాల్పడుచు, ఇక్కడ దుఖాణాల ఏర్పాటు చేసుకోవడానికి తమకు జీఎచ్ఎంసీ ఆధికారుల అనుమతులున్నాయని బుకాయించడం విడ్డూరంగా ఉంది. పాదాచారుల రక్షణ కోసం కోట్లు ఖర్చుపెట్టి ఏర్పాటుచేసిన ఫుట్ పాత్ లపై శాశ్వత నిర్మాణాలు చేయడం ఏమిటని పాదాచాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేల జీఎచ్ఎంసీ అధికారులే అనుమతులిస్తే ఫుట్ పాత్ పై ఏ ప్రాతిపాధికన ఇచ్చారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అత్యంత ప్రమాధకర అంటువ్యాధి అయిన క్షయ శిక్షణా కేంద్రం పరిసరాలలో టిపిన్ సెంటర్లు, కూరగాయల విక్రయాలకు ఫూట్ పాత్ లను అమ్ముకోవడం ఎంత వరకు సమంజసమనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఫూట్ పాత్ లపై శాశ్వత నిర్మాణల వల్ల ఎదురయ్యే ప్రమాధాలకు ఎవరు భాధ్యత వహిస్తారనే ప్రశ్నలు గుప్పుమంటున్నాయి. దీంతో ఫూట్ పాత్ అక్రమణలకు ఆక్రమంగా అధికారిక లైసెన్స్ ఇచ్చే పరిస్థితికి జీఎచ్ఎంసీ ఆధికారులు దిగజారడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్లపై సంచరించే పాధాచారుల సౌకర్యార్థం రోడ్డుకు ఇరువైపుల ఫూట్ పాత్ నిర్మాణాలను చేపట్టి ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా పాదచారుల కోసమే ఉద్దేశించబడినవి. ఫుట్పాత్లపై వ్యాపారాలు, షెడ్లు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధం. దీనిపై తరచు జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నను సత్ఫలితాలను ఇవ్వకపోగా కబ్జారాయుళ్లు మరింత రెచ్చిపోతున్నారు. ఇలా ఆక్రమణలు తొలగించడం ద్వారా పాదచారులకు సౌకర్యం కల్పించడంతో పాటు ట్రాఫిక్ సమస్యలను తగ్గించడమే లక్ష్యంగా ఉండగా, ఫూట్ పాత్ ల అక్రమణలకు, శాశ్వత నిర్మాణాలకు ఏకంగా జీఎచ్ఎంసీ ఆధికారులే నిబంధనలకు మంగళం పాడి అనుమతులు ఇవ్వడమేంటని, ఈ పరిస్థితులు ఎంత వరకు దారితీస్తాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

దీనిపై మున్సిఫల్ శాఖామంత్రి కూడా అయిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి p వెంటనే స్పందించి ఎస్.ఆర్ నగర్ నుండి చాతి ఆస్పత్రి వరకు కబ్జాలకు గురైన ఫూట్ పాత్ లను గుర్తించి వాటిపై జరుగుచున్న శాశ్వత నిర్మాణాలను వెంటనే తొలగించి ఫూట్ పాత్ లను కేవలం పాధాచారుల సంచారానికే పరిమితం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, పాదాచారులు కోరుచున్నారు.

# హాఫీజ్‌పేట్ రెగుల కుంట కబ్జా

- బాధ్యతారాహిత్యంలో రెవెన్యూ అధికారులు
- ఫిర్యాదు చేసిన స్పందన శూన్యం
- కబ్జాదారులతో ములాఖత్ అయినారా.?
- హైడ్రా ఉందని తెలిసి కూడా కబ్జా ఎవరి అండతో.?
- కబ్జాదారులతో రెవెన్యూ అధికారుల ఆర్థిక ఒప్పందాలా.?
- శేర్లింగంపల్లి రెవెన్యూ కార్యాలయం పై ఏసీబీ దృష్టి సారించేనా.?
- కబ్జాలపై ఆర్డిఓ, కలెక్టర్ నిర్లక్ష్యమెందుకు






శేర్లింగంపల్లి(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ స్థలాలను చెరువుల, పార్కులకు కబ్జాను అరికట్టేందుకు హైడ్రా ను ఏర్పాటు చేశారు అయినా కొంతమంది కబ్జారాయుళ్లు హైడ్రా ను కూడా అసలు లెక్కచేయడం లేదు. హైడ్రా రోజురోజుకు బలహీనమైపోయిందని కబ్జాలపై ఉక్కు పాదం మోపడం కాదు కదా ఉత్త పాదం కూడా మోపడం లేదని హైడ్రా కూడా సాధారణ స్థితికి రావడంతో కబ్జారాయుళ్లు రెచ్చిపోతున్నారు. శేర్లింగంపల్లి మండల పరిధిలోని హాఫీజ్‌పేట్ గ్రామంలో పాతకాలం నుండి ఉన్న రెగుల కుంట (సర్వే నం.151) రోజురోజుకూ అక్రమ నిర్మాణాలు, కబ్జాల బారిన పడుతూ వస్తోంది. పర్యావరణానికి, భూగర్భజలాల సంరక్షణకు కీలకంగా నిలిచిన ఈ కుంటను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని స్థానికులు చెబుతున్నారు. అయితే శేర్లింగంపల్లి రెవెన్యూ అధికారులు ఎన్ని ఫిర్యాదులు చేసిన అస్సలు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'జనం కోసం' సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ కుంటలు, చెరువులు అన్నీ ప్రజల ఆస్తి. వాటిని కాపాడటం అధికారుల ప్రథమ కర్తవ్యమవ్వాలి. కానీ రెగుల కుంట విషయంలో అధికారులు కళ్లెదుట జరుగుతున్న కబ్జాలను అడ్డుకోవడం లేదు. రెవెన్యూ అధికారులు కబ్జారాయులతో చేతులు కలిపారా అని ప్రశ్నించారు. అంతర్గత ఆర్థిక ఒబ్బందాలు చేసుకొని కబ్జా చేసిన పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి తార్కాణం అన్నారు.

### ఫిర్యాదులు, కానీ చర్యలేదని ఆవేదన

కబ్జాలు అంటే ఇక మున్సిపల్ అధికారులకు పండగే ఎన్ని కబ్జాలు చేస్తే అంత అప్రమస్తులు కూడబెట్టుకోవచ్చని అన్నట్లుగా మారింది పరిస్థితి. సాక్షాత్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించే దిక్కు లేదంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సమస్యపై ఇప్పటికే జోనల్ కమిషనర్ (వెస్ట్‌జోన్), డిప్యూటీ కమిషనర్ (చందానగర్), శేర్లింగంపల్లి తహసీల్దార్ కార్యాలయానికి పలు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి చర్యలు జరగకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది.

రాజేంద్రనగర్ ఆర్‌డీవో ఈ ఫిర్యాదు నేపథ్యంలో సంబంధిత శాఖలకు విచారణ ఆదేశాలు జారీ చేసినా, అమలు మాత్రం ఇంకా కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఆర్డీవో ఆదేశాలను లెక్కచేయడం లేదంటే రెవెన్యూ సిబ్బంది భారీగా లంచాలు తీసుకొని మౌనంగా ఉన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### చరిత్రాత్మక ప్రాధాన్యం

రెగుల కుంటకు దాదాపు వందేళ్ల చరిత్ర ఉంది. ఒకప్పుడు ఈ కుంట నుంచి పరిసర గ్రామాల వ్యవసాయ భూములకు నీటిని సరఫరా చేసేవారు. హాఫీజ్‌పేట్ ప్రజలందరికీ ఇది ప్రాణాధారం. కానీ పట్టణీకరణ పెరిగేకొద్దీ కుంట పరిధిని ఆక్రమించి భవనాలు కట్టడం ప్రారంభమైంది. దీంతో కుంట చిన్నదవుతూ, ఇప్పుడు పూర్తిగా నశించే దిశగా వెళ్తోంది.

### ప్రజల స్పందన

స్థానికులు చెబుతూ, "రెవెన్యూ అధికారులు కబ్జాలను అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. కొందరు కబ్జా రాయులు రెగ్యులర్ కుంట చుట్టూ ప్లాట్లు, భవనాలు కడుతూ ఉంటే చూడలేదా.? ఇకనైనా శేర్లింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు, చందానగర్ సర్కిల్ అధికారులు లంచాలు పక్కనపెట్టి ప్రజా ప్రతినిధులు మేల్కొని చర్యలు తీసుకోవాలి. లేకపోతే రాబోయే రోజుల్లో ఈ ప్రాంతం నీటి కోసం అల్లాడిపోవాల్సిందే" అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### పర్యావరణ ముప్పు

నిపుణులు హెచ్చరిస్తూ, "కుంటలు నశిస్తే భూగర్భజలాలు ఎండిపోతాయి. వర్షాలు పడినా నీరు నిల్వ ఉండదు. కాలుష్యం విపరీతంగా పెరిగి, వాతావరణం ప్రతికూలంగా మారుతుంది. పట్టణాలలో కుంటలు కాపాడకపోతే జీవన ప్రమాణాలు దెబ్బతింటాయి" అని చెబుతున్నారు.

### డిమాండ్

ప్రజలు, పర్యావరణ కార్యకర్తలు ప్రభుత్వాన్ని కోరుతూ "కుంటపై ఉన్న అన్ని కబ్జాలను వెంటనే తొలగించి, చుట్టూ రక్షణ గోడ నిర్మించాలి. కుంట శుద్ధి పనులు చేయాలి. రెవెన్యూ అధికారులు, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పని చేస్తేనే రెగుల కుంటను కాపాడగలం" అని స్థానిక ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

# స్మార్ట్ వైజాగ్‌కు

# మరో ముందడుగు

- రూ.498 కోట్ల భారీ రుణం



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీలో ఏకైక మహానగర పాలక సంస్థగా ఉన్న గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పోరేషన్ (జీవీఎంసీ) మరో అరుదైన ఘనత అందుకుంది. కూటమి సర్కార్ హయాంలో పాలక వర్గం మార్పు తర్వాత అభివృద్ధిలో వేగంగా అడుగులేస్తున్న జీవీఎంసీకి ఓ విషయంలో జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందాలపై సంతకాలు కూడా జరిగాయి. దీంతో జీవీఎంసీ జాతీయ స్థాయిలో రికార్డు సృష్టించినట్లయింది. విశాఖ నగరాభివృద్ధి కోసం అంతర్జాతీయ ఆర్థిక సంస్థ నుంచి రూ.498కోట్ల రుణాన్ని తీసుకునేందుకు వీలుగా ఓ ఒప్పందం జరిగింది. విశాఖపట్నం మహానగర పాలక సంస్థ ఈ రుణం తీసుకునేందుకు సంబంధించి ఐఎఫ్‌సీ-జీవీఎంసీ అధికారులు మధ్య సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం జరిగింది. అనంతరం జీవీఎంసీ అధికారులు ముఖ్యమంత్రితో సమావేశమై త్వరలో చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టు వివరాలను వెల్లడించారు. ఈ ఒప్పందంతో భారతదేశంలో మొదటిసారిగా అంతర్జాతీయ ఆర్థిక సంస్థ నుంచి ప్రత్యక్ష రుణం పొందిన మున్సిపల్ కార్పొరేషన్‌గా జీవీఎంసీ నిలిచిందని అధికారులు తెలిపారు. విశాఖపట్నంలోని మధురవాడ జోన్-2లో ఆధునిక మురుగునీటి వ్యవస్థను ఈ ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేస్తారు. దీనికి మొత్తం రూ.553 కోట్లు వ్యయం కానుంది. ఇందులో రూ.498 కోట్లు ఐఎఫ్‌సీ రుణంగా ఇవ్వనుంది. మిగిలిన మొత్తంలో అమృత్ 2.0 నుంచి రూ.45.64 కోట్లు, జీవిఎంసీ సొంత నిధులు రూ. 9.36 కోట్లు వినియోగించనుంది. జీవీఎంసీ తన సొంత ఆదాయ వనరుల ద్వారా ఈ రుణాన్ని తిరిగి ఐఎఫ్‌సీకి చెల్లించనుంది. 15 సంవత్సరాల కాలపరిమితి కలిగిన ఈ రుణానికి వడ్డీ రేటు 8.15 శాతం (ఫ్లోటింగ్)గా నిర్ణయించారు. త్వరలో మొదలయ్యే మధురవాడ మురుగునీటి ప్రాజెక్టుతో 100 శాతం అండర్‌గ్రౌండ్ మురుగునీటి నెట్‌వర్క్, ఆధునిక పంపింగ్ - లిఫ్టింగ్ స్టేషన్లు, అత్యాధునిక శుద్ధి కేంద్రం - నీటి పునర్వినియోగం, రీసైక్లింగ్ చేయనున్నారు. 30 ఏళ్ల జనాభా వృద్ధి అవసరాలను దృష్టిలో పెట్టుకొని దీనిని డిజైన్ చేశారు. నీటి శుద్ధి వల్ల వ్యాధులు తగ్గడంతో పాటు, భూగర్భజలాలు కలుషితం కావు, పర్యావరణానికి మేలు చేస్తుందని, వరద నీటి నిర్వహణు ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.

# జీ20 దేశాల్లో

# భారత్‌దే రికార్డ్

- జీ20 దేశాల్లోనే అత్యల్పంగా భారత్‌లో నిరుద్యోగ రేటు
- కేవలం 2 శాతంగా ఉందని వెల్లడించిన కేంద్ర మంత్రి మాండవీయ
- మెంటర్ టుగెదర్, క్వీక్కర్‌తో కేంద్ర కార్మిక శాఖ ఒప్పందాలు




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారతదేశం ఉద్యోగ కల్పనలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని, ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలైన జీ20 దేశాలతో పోలిస్తే మన దేశంలోనే నిరుద్యోగ రేటు అత్యల్పంగా ఉందని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ వెల్లడించారు. ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్) విడుదల చేసిన 'ది ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ రిపోర్ట్ 2025' ప్రకారం భారతదేశంలో నిరుద్యోగ రేటు కేవలం 2 శాతంగా నమోదైందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మాండవీయ ప్రసంగించారు. దేశ ఆర్థిక వృద్ధికి అనుగుణంగా అన్ని రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయని, ప్రభుత్వ పథకాలు ఇందుకు ఎంతగానో దోహదపడ్డాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ కెరీర్ సర్వీస్ (ఎన్సీఎస్) పోర్టల్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు 'మెంటర్ టుగెదర్', 'క్విక్కర్' సంస్థలతో కార్మిక మంత్రిత్వ శాఖ అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకుంది.ప్రస్తుతం ఎన్సీఎస్ పోర్టల్‌లో దాదాపు 52 లక్షల కంపెనీలు, 5.79 కోట్ల మంది ఉద్యోగార్థులు రిజిస్టర్ చేసుకున్నారని మంత్రి వివరించారు. ఈ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 7.22 కోట్ల ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకువచ్చామని, ప్రస్తుతం 44 లక్షలకు పైగా ఉద్యోగాలు యాక్టివ్‌గా ఉన్నాయని ఆయన తెలిపారు. ఉద్యోగ సమాచారం అందించడమే కాకుండా ఉపాధికి సంబంధించిన అన్ని సేవలకు దీనిని ఒకే వేదికగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు పెద్దపీట వేసిందని మాండవీయ గుర్తుచేశారు. యువతలో నైపుణ్యం, ఉపాధి కోసం రూ. 2 లక్షల కోట్ల బడ్జెట్‌తో ఐదు ప్రధాన పథకాలను ప్రకటించిందని తెలిపారు. ఇందులో భాగంగా, రూ. 99,446 కోట్ల కేటాయింపులతో ప్రారంభించిన 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' (పీఎం-వీబీఆర్‌వై) ద్వారా రాబోయే రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాలు సృష్టించడం లక్ష్యమని పేర్కొన్నారు. వీరిలో 1.92 కోట్ల మంది తొలిసారిగా ఉద్యోగాల్లో చేరే యువత ఉంటారని అన్నారు.కొత్తగా కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా ఉద్యోగార్థులకు మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. 'మెంటర్ టుగెదర్' భాగస్వామ్యంతో మొదటి ఏడాదిలోనే 2 లక్షల మంది యువతకు వ్యక్తిగత కెరీర్ మార్గదర్శకత్వం అందించనున్నారు. ఇక 'క్విక్కర్' ఒప్పందం ద్వారా దేశవ్యాప్తంగా 1,200 నగరాల నుంచి రోజూ 1,200కు పైగా ఉద్యోగ ప్రకటనలను ఎన్సీఎస్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఇది గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers".
H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588